నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 30-6-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 271 పేజీలు: 4 వెల: రూ.1/-

యాసంగి ధాన్యం కొనుగోలులో ఆల్ టైం రికార్డ్ : మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ , జూన్ 29: యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ ఆల్ టైం రికార్డ్ సాధించిందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. యాసంగిలో ధాన్యం కొనుగోళ్లు ముగిసినట్లు వెల్లడించిన ఆయన 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసినట్లు చెప్పారు. 23 జిల్లాల్లో అంచనాలకు మించి వందశాతం పైగా కొనుగోళు జరిగాయన్నారు. ఇది గత ఏడాది కంటే 28 లక్షల టన్నులు అధికమన్నారు. 15 లక్షల మంది రైతుల నుంచి రూ.17 వేల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. ఏడేళ్లల్లో ఒక్క యాసంగిలోనే 594 శాతం పెరుగుదల నమోదైందన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన రైతు సంక్షేమ చర్యలతో రాష్ట్రంలో ఏటేటా పెరుగుతున్న ధాన్యం దిగుబడులకు అనుగుణంగా పౌరసరఫరాల సంస్థ రైతుల నుంచి కనీస మద్దతు ధరకు రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేసిందని తెలిపారు. మంగళవారం నగరంలోని పౌరసరఫరాల భవన్‌లో మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విలేకరుల సమావేశం ద్వారా వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో రూ. 84 వేల కోట్లు విలువ చేసే 4 కోట్ల 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, అప్పటి నుంచి 2019-20 వరకు ధాన్యం కొనుగోలు చేసిన ఐకేపీ. పీఏసీఎస్, డీసీఎస్టీతో జీ.సీ.సీ, హాకా వంటి ఇతర ఏజెన్సీలకు రూ.1,029 కోట్ల కమీషన్‌ను చెల్లించినట్లు తెలిపారు.

గత పరిస్థితులకు భిన్నంగా పంటల దిగుబడులు..

ఇదివరకు యాసంగిలో కంటే వానాకాలంలో ఎక్కువ పంటలు పండేవి. ఇప్పుడు దీనికి భిన్నమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. వానాకాలంలో పండిన పంట కంటే కూడా యాసంగిలో అధిక పంటలు పండుతున్నాయన్నారు. దీనికి ఈ ఏడాది యాసంగిలో ధాన్యం దిగుబడి, కొనుగోళ్లే నిదర్శనమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తొలి ఏడాది 2014 ? 15 యాసంగిలో 13.24 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తే, నేడు 2021 యాసంగిలో 92 లక్షల మెట్రిక్ టన్నులకు చేరడం.. అంటే 594 శాతం కొనుగోళ్లు పెరిగాయన్నారు. ఇది యావత్తు తెలంగాణ రైతాంగం విజయంగా అభివర్ణించారు.

లక్ష్యానికి మించి కొనుగోళ్లు..

ఏప్రిల్ మొదటివారంలో రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల కొరకు 6, 968 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపిన మారెడ్డి దాదాపు రెండున్నర నెలలపాటు కొనుగోళ్ల ప్రక్రియను నిర్విరామంగా సాగించి రికార్డు స్థాయిలో 15 లక్షల మంది రైతుల నుంచి రూ.17,300 కోట్ల విలువ చేసే 92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లు ముగియడంతో రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు చెప్పారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకోగా అదనంగా 12 లక్షలు (13 శాతం) అధికంగా కొనుగోలు చేశామని తెలిపారు. ఇందుకు అదనంగా మరో రూ. 2 వేల కోట్ల వ్యయం అయిందన్నారు.

తెలంగాణ దేశానికే కొత్త మార్గం చూపిస్తోంది..

ముఖ్యమంత్రి కేసీఆర్ దిశా నిర్దేశం, మార్గదర్శకాల మేరకు పెరిగిన దిగుబడులకు అనుగుణంగా పౌరసరఫరాల సంస్థ చేపట్టిన చర్యలు రైతాంగంలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసిందన్నారు. అంతేకాకుండా దేశంలో ఏ రాష్ట్రానికి సాధ్యంకాని విధంగా తెలంగాణ పౌరసరఫరాల సంస్థ వందశాతం ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తూ దేశానికే కొత్త మార్గాన్ని చూపిస్తోందని మారెడ్డి పేర్కొన్నారు.

అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన జిల్లాలు (మెట్రిక్ టన్నుల్లో)..

నల్లగొండ-7,83,574.. నిజామాబాద్-7,55,819.. నూర్యా పేట-6,49,192.. జగిత్యాల-5, 52,794.. సిద్దిపేట-5,40,049.. కామారెడ్డి-4,51,154.. మెదక్-4,41 ,130.. కరీంనగర్-4,14,859.. యాదాద్రి-4,06859.. పెద్దపల్లి-3,89,601.

సీఎం చర్యలతో మారిన వ్యవసాయ ముఖచిత్రం..

తెలంగాణ రాష్ట్రాన్ని రైతు రాజ్యంగా మార్చాలి. రైతును రాజును చేయాలన్నది సీఎం కేసీఆర్ అంతిమ లక్ష్యం. ఈ లక్ష్యం చేరుకోవడానికి ఇప్పటికే ఎన్నెన్నో రైతు సంక్షేమ చర్యలను చేపట్టి అమలు చేస్తున్నారు. సీఎం తీసుకున్న రైతు సంక్షేమ చర్యల వల్ల రాష్ట్రంలో వ్యవసాయ ముఖచిత్రమే మారిపోయిందన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా, ఎరువుల పంపిణీ, రైతువేదికలు, మిషన్ కాకతీయ లాంటి పథకాలు అధిక దిగుబడులు రావడానికి తోడ్పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలు, మార్గదర్శకత్వంలో రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరకు పౌరసరఫరాల సంస్థ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తిచేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కరోనా సెకండ్ వేవ్ ఇంకా సమసిపోలేదు : డాక్టర్ హర్షవర్ధన్

న్యూఢిల్లీ, జూన్ 29: కరోనా సెకండ్ వేవ్ ఇంకా సమసిపోలేదని ఎలాంటి పరిస్థితిలోనూ మనం మహమ్మారిని తేలికగా తీసుకోరాదని ఏడాదిన్నర అనుభవం వెల్లడిస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. ఢిల్లీ ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్, లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్‌తో మంత్రి మంగళవారం వర్చువల్ భేటీలో మాట్లాడారు.

కొవిడ్-19 సెకండ్ వేవ్ ఇంకా ముగిసిపోలేదని, ఢిల్లీలో కేసులు గణనీయంగా తగ్గినా మనం విశ్రమించరాదని స్పష్టం చేశారు. ప్రజలు, సమాజం కూడా మహమ్మారి తగ్గుముఖం పట్టిందని విశ్రమించరాదని, మనం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గత ఆరు నెలలుగా కరోనా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు పెద్దసంఖ్యలో వ్యాక్సిన్లు వేయించుకోవడం, కరోనా నిబంధనలను పాటించడం ద్వారా కొవిడ్-19పై పోరులో మనం విజయం సాధించవచ్చని పేర్కొన్నారు.

ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ కీలక సూచన

హైదరాబాద్ , జూన్ 29:తెలంగాణలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను సవరించాలని రిసోర్స్ మొబిలైజేషన్ పైన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమశ్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ శేషాద్రి, వివిధ శాఖ అధిపతులు పాల్గొన్నారు. ప్రజల పైన భారీగా భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం పెంచేందుకు ఉన్న అవకాశాలపైన ఇప్పటికే పలుసార్లు సమావేశమైన కేబినెట్ సబ్ కమిటీ మంగళవారం మరోసారి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సమావేశమైంది.

ఈ సందర్భంగా రాష్ట్రంలో భూముల విలువను సవరించేందుకు ఉన్న అవకాశాల పైన వివిధ శాఖల ఉన్నతాధికారులతో సబ్ కమిటీ విస్తృతంగా చర్చించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణ పెద్ద ఎత్తున అభివృద్ధి సాధిస్తూ వస్తున్నదని, దీంతోపాటు ప్రభుత్వం చేపట్టిన ఆ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలో భూముల విలువ భారీగా పెరిగిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులు మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు.

మరోవైపు ప్రభుత్వం చేపట్టిన పలు సాగునీటి ప్రాజెక్టులు, ఇతర వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు సైతం పెద్ద ఎత్తున విలువ పెరిగిన విషయం సబ్ కమిటీ సమావేశంలో చర్చకు వచ్చింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి భారీగా భూముల విలువ పెరిగినా, గత ఎనిమిది సంవత్సరాల్లో రిజిస్ట్రేషన్ విలువల్లో ఏలాంటి పెంపు చేయలేదు. ప్రభుత్వ నిర్ధారిత విలువల కన్నా అధిక మొత్తాల్లో భూములు, ఆస్తుల క్రయవిక్రయాలు జరుగుతున్న చాలామంది నిర్ధారిత ప్రభుత్వ విలువల మేరకే రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని అధికారులు ఈ సందర్భంగా మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ఇలాంటి లావాదేవీల వలన సమాంతర ఆర్థిక వ్యవస్థ నడుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

చట్ట ప్రకారం ప్రభుత్వం ఎప్పటికీ అప్పుడు విలువల సమీక్ష చేయాల్సిన అవసరం ఉన్నదని, ఇదే చట్టం ఆధారంగా ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 8 సంవత్సరాల్లో ఏడుసార్లు భూ విలువలను సవరించి, రిజిస్ట్రేషన్ ఫీజులను 11 శాతానికి పెంచిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. పక్కనే ఉన్న తమిళనాడులో 7.5, మహారాష్ట్రలో 7 శాతం గా రిజిస్ట్రేషన్ ఫీజులు ఉన్నాయని అధికారులు మంత్రులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ఆదాయంలో ప్రధాన వాటా కలిగిన హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో పెద్ద ఎత్తున భూములు, ఆస్తుల విలువలు పెరిగిన విషయం సబ్ కమిటీలో విస్తృతంగా చర్చించింది. గత ఏడు సంవత్సరాలుగా హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలో ముఖ్యంగా హెచ్ఎండీఏ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి తరలివచ్చిన భారీ పెట్టుబడులు, నూతన పరిశ్రమల ఏర్పాటు, నగర విస్తరణ వలన రియల్ భూమ్ వచ్చిందన్నారు. 2019- 20 సంవత్సరానికి సంబంధించి హెచ్ఎండీఏ పరిధిలో జరిగిన రిజిస్ట్రేషన్లలో సుమారు 51 శాతం లావాదేవీలు ప్రభుత్వ నిర్ధారిత విలువలకు మించి అధికంగా రిజిస్ట్రేషన్లు అయిన విషయాన్ని ఈ సందర్భంగా అధికారులు క్యాబినెట్ సబ్ కమిటీకి వివరించారు.

మరోవైపు ప్రభుత్వ విలువ మార్కెట్ విలువ కన్నా చాలా తక్కువగా ఉండటంతో భూములు ఇల్లు కొనుగోలు చేసే ప్రజలకు బ్యాంకు లోన్లు రావడంలో కొన్ని పరిమితులు ఉంటున్నాయని, ఇలాంటి ఇబ్బందులు తొలగించేందుకు పెరిగిన విలువకు అనుగుణంగా సవరణ చేయాల్సిన అవసరం ఉందని కేబినెట్ సబ్ కమిటీ అభిప్రాయపడింది. వివిధ కారణాలతో సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న భూముల విలువల సవరణ వెంటనే చేపట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయానికి కేబినెట్ సబ్ కమిటీ వచ్చింది. ఈ మేరకు కేబినెట్ సబ్ కమిటీ ఒక నివేదికను ముఖ్యమంత్రి కేసీఆర్ కి త్వరలోనే అందించాలని నిర్ణయం తీసుకుంది.

బోనాల వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి : సీపీ అంజనీ కుమార్

హైదరాబాద్ , జూన్ 29:హైదరాబాద్‌లో బోనాలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ అధికారులు, పోలీసులను ఆదేశించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. బోనాల వేడుకల్లో కొవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అనారోగ్యంతో ఉన్న వారెవరూ ఆలయాలకు రావొద్దని సూచించారు. నకిలీ విత్తనాలు, డ్రగ్స్ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ అంజనీ కుమార్ హెచ్చరించారు.జూలై 11న గోల్కొండ కోట పైనున్న జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో జరిగే మొదటి బోనం పూజతో ఈ ఏడాది బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలకు దేవాదాయశాఖ అధికారులు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హరితహారంతో ములుగుకు పూర్వవైభవం రావాలి

ములుగు, జూన్ 29: : హరితహారంతో ములుగు జిల్లాకు పూర్వవైభవం రావాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం, పల్లె, పట్టణ ప్రగతి, హరితహారంపై జిల్లా స్థాయి సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. జిల్లా దట్టమైన అడవులతో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది. కానీ అనేక కారణాల వల్ల నేడు అడవులు అదృశ్యం అయ్యాయని తెలిపారు. అయితే రాష్ట్రంలో తరిగి పోయిన అడవులను మళ్లీ పెంచుకోవడానికి సీఎం కేసీఆర్ దేశంలో ఏ నాయకుడు చేయని ప్రయత్నం హరితహారం ద్వారా చేస్తున్నారని ప్రశంసించారు.

పల్లె ప్రగతి ద్వారా గ్రామాలను పచ్చగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో భావితరాలకు తరగని ఆస్తిగా పచ్చని పర్యావరణాన్ని అందించే లక్ష్యంతో సీఎం హరితహారం చేపట్టారన్నారు. ఇందులో ప్రతి ఇంటికి ఆరు మొక్కలు ఇవ్వడం నుంచి అడవుల్లోని ఖాళీ ప్రదేశాల్లో కూడా మొక్కలను పెంచే లక్ష్యం నిర్దేశించారన్నారు.

రాష్ట్రంలోని జాతీయ, రాష్ట్ర రహదారులు, జిల్లా రోడ్లు, గ్రామపంచాయతీ లోని అంతర్గత రోడ్ల లో కూడా మొక్కలు నాటివ వాటిని సంరక్షించాలన్నారు. ఈ 10 రోజుల పల్లె ప్రగతి ప్రణాళికలో పనులను మనసుపెట్టి చేయడం ద్వారా మంచి ఫలితాలు అందుతాయని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఏవీ లేనందున పల్లె ప్రగతి పనులు సక్రమంగా జరిగేలా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

మంత్రిగా తాను, ఎంపీ, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు కలిసి ఎప్పుడైనా ఆకస్మికంగా వచ్చి పల్లె ప్రగతి పనులు తనిఖీ చేస్తామన్నారు. పనులు బాగుంటే అభినందించి అవార్డులు ఇస్తాం. బాగా చేయకపోతే వెంటనే చర్యలు తీసుకుంటామని, అధికారులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

పల్లె ప్రగతితో ఊహించని మార్పు : మంత్రి సబిత

రంగారెడ్డి,. జూన్ 29: సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పల్లె, పట్టణ ప్రగతి ద్వారా ఊహించని మార్పు వచ్చిందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జులై 1 వ తేదీ నుంచి ప్రారంభం అయ్యే పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, హరితహారం కార్యక్రమ సన్నాహకల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎమ్మెల్యేలు, మేయర్ లు, ఎంపీపీ, జడ్పీటీసీలు, చైర్మన్‌లు, సర్పంచ్ లు, ఎంపీటీసీలు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ మానస పుత్రిక హరితహారం కార్యక్రమం అన్నారు. ఏడో విడత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పల్లె ప్రగతి ద్వారా ప్రతి నెల రాష్ట్రంలో రూ.308 కోట్లు, పట్టణ ప్రగతి ద్వారా రూ.150 కోట్లు నేరుగా గ్రామాలకు, మున్సిపాలిటీలకు నిధులు అందజేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి నెల రూ.12 కోట్ల 38 లక్షలు, పట్టణ ప్రగతిలో భాగంగా రూ.5 కోట్ల 60 లక్షల నిధుల విడుదల చేశామని పేర్కొన్నారు.

గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో లలో పచ్చదనం, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన, పాఠశాలలు, దవాఖానలు, కార్యాలయాల వద్ద మొక్కలు నాటాలన్నారు. ప్రతి ఇంటికి మొక్కలు ఇవ్వాలి. గత పల్లె ప్రగతి, పట్టణ ప్రగతిలో భాగంగా మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించాలి. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎక్కడికక్కడ చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ అనిత రెడ్డి, కలెక్టర్ అమోయ్ కుమార్, చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 29: కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఇటీవల కరోనా మహమ్మారి బారినపడి కోలుకున్న ఆయన.. కొవిడ్ అనంతర సమస్యలతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడటంతో ఇవాళ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఎయిమ్స్ ఆస్పత్రి వర్గాలు ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించాయి.

వైద్య విద్యార్థులు సేవా భావంతో పని చేయాలి

మహబూబ్ నగర్, జూన్ 29:: వైద్య విద్యార్థులు సేవా భావంతో పని చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి డాక్టర్ వి . శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. మంగళవారం మంత్రి ఎదిర శివారులో ఉన్న మహబూబ్ నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో బాలుర, బాలికల జిమ్నాయిజం, రిక్రియేషన్ కేంద్రాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహబూబ్ నగర్ వైద్య కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు.ఎంతో శ్రమకోర్చి వైద్య కళాశాలను ప్రారంభించామని, విద్యార్థులు బాగా చదివి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే అల వెంకటేశ్వర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ పుట్ట శ్రీనివాస్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పర్యవేక్షకుడు డాక్టర్ రామ్ కిషన్, మెడికల్ కళాశాల డాక్టర్ కిరణ్, కౌన్సిలర్ యాదమ్మ తదితరులు ఉన్నారు.

చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ నాజూకున సీతమాలా
రాజిల్లుచు నటనలాన రారాజసుడున్
బ్రాజిత సుగుణుడై వెలగెడి
శ్రీ జే.వి. సోమయాజి "శేషుని వెంటనే" !!

(జూన్ 30 నటుడు శ్రీ జే.వి. సోమయాజులు జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

పూర్వ ప్రధాని కీ॥ శే॥ పీ.వీ.నరసింహారావుగారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా
వూసల ఎడ్యుకేషనల్ & వెల్ఫేర్ సొసైటీ (రి.నం. 702/2008) మరియు
శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో
"తెలుగుతేజం పీ.వి. నరసింహారావు" సీసపద్యకావ్యం ఆవిష్కరణ మరియు అంకితోత్సవం
వేదిక - ప్రపంచరికార్డు సాధించిన శ్రీ త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదిక
సమయం - బి 30-6-2021 బుధవారం సా॥5 గం॥

కృతి భర్త

డా॥ కె.వి.రమణాచారిగారు
(రి)ఐ.ఏ.ఎస్. ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సలహాదారులు

కావ్యనాయకుడు



కీ॥శే॥పి.వి.నరసింహారావుగారు
పూర్వప్రధాని

కృతి కర్త

డా॥ వూసల రజనీగంగాధర్
పీవీ స్మారక లెజండరీ పురస్కార గ్రహీత

సభాధ్యక్షులు



శ్రీ పాత్తూరు సుబ్బారావుగారు
(సాహితీకిరణం సంపాదకులు)

ముఖ్యఅతిథి

శ్రీ ఓలేటి పార్వతీశంగారు
(విశ్రాంత కార్యనిర్వహణాధికారి దూర దర్శన్)

విశిష్టఅతిథి

శ్రీ కళా జనార్ధన మూర్తిగారు
(శ్రీ త్యాగరాయగానసభ అధ్యక్షులు)

ఆత్మీయ అతిథులు

శ్రీ బైస దేవదాసుగారు
(నేటినిజం పత్రిక సంపాదకులు)

శ్రీ బంగారు వి.బి.ఆచార్యులుగారు
(రచయిత సాహితీ విమర్శకులు)

ప్రధాన వక్త
శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మగారు
(విశ్రాంత ప్రధానాచార్యులు)

కవిసమ్మేళన నిర్వహణ, స్వాగత వచనం.
వందన సమర్పణ - శ్రీ పెద్దూరి వెంకటదాసుగారు

కవిసమ్మేళనంలో పాల్గొను కవులు-శ్రీయుతులు గోవర్ధనం రాఘవాచార్యులు, సుతారపు వెంకటరమణ, నోరి రాజేశ్వరరావు బాలగంగాధరయ్య, డి. దైవాధీనం, అనుముల ప్రభాకరాచారి, ఎన్ శివప్రసాద్, బోనాల ప్రకాష్, చక్రవర్తి, మోహనకృష్ణ గజవెల్లి, అరుణకుమారి, నన్నపురాజు విజయశ్రీ, ఉన్న విజయలక్ష్మి, శిష్ట్లా మాదవి.

సంయమనం, సమయపాలన మన సంస్కృతిలో ప్రథమస్థానం. ధన్యవాదాలు.

సాహితీ నమస్సులతో
డా॥ వూసల రజనీగంగాధర్ దంపతులు మరియు
కుటుంబ సభ్యులు.

దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం: సీరం ఇన్ స్టిట్యూట్ కి సూచించిన ఈయూ

న్యూఢిల్లీ, జూన్ 29:కొవిషీల్డ్ కు అనుమతి కోరుతూ తమకు ఎలాంటి దరఖాస్తు అందలేదని స్పష్టం చేసింది ఈయూ ఔషధ నియంత్రణ సంస్థ. పలు దేశాల నుంచి ఏమంత ప్రాముఖ్యత లేని ప్రయాణాలను తాము అనుమతించడంలేదని, అందులో భారత్ కూడా ఉందని వెల్లడించింది. నిన్నటివరకు కొవిషీల్డ్ కు అనుమతి ఇవ్వాలంటూ తమకు ఎలాంటి విజ్ఞాపన రాలేదని, ఒకవేళ వస్తే తమ విధివిధానాల మేరకు పరిశీలిస్తామని ఈయూ ఔషధ నియంత్రణ సంస్థ హామీ ఇచ్చింది.

భారత్ లో తయారైన కొవిషీల్డ్ కరోనా వ్యాక్సిన్ తీసుకున్నవారికి యూరప్ దేశాల్లో ప్రయాణాలకు ఆటంకాలు ఏర్పడుతున్న నేపథ్యంలో, భారతీయుల్లో ఆందోళన హెచ్చుతోంది. యూరోపియన్ యూనియన్ గ్రీన్ పాస్ పేరిట ఓ జాబితా అమలు చేస్తోంది. ఆ జాబితాలో ఉన్న వ్యాక్సిన్లు తీసుకున్నవారికి తమ దేశాల్లో అనుమతి ఇస్తోంది. ఇటీవలే ఈ జాబితా నుంచి కొవిషీల్డ్ ను తొలగించారు. దీనిపై కొవిషీల్డ్ ఉత్పత్తిదారు సీరం ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత అదర్ పూనావాలా స్పందిస్తూ, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఈయూ ఔషధ నియంత్రణ సంస్థ స్పందించింది.

జూలై 19 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, జూన్ 29:పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 19 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే అవకాశముంది. పార్లమెంటరీ వ్యవహారాలపై ఏర్పాటైన కేబినెట్ కమిటీ ఈ మేరకు తేదీలు సిఫార్సు చేసింది. కరోనా? దృష్ట్యా.. గతేడాది సాధారణంగా జులైలో ప్రారంభం కావాల్సిన వర్షాకాలం సమావేశాలు సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యాయి. అయితే ఈసారి మాత్రం యథావిధిగా జులైలోనే జరుగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి ఇదివరకే ప్రస్తావించారు. కొవిడ్? వ్యాప్తి ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంటు సెషన్స్? కుదించినట్లు జోషి పేర్కొన్నారు. మహమ్మారి కారణంగా గతేడాది పార్లమెంటు శీతాకాలపు సమావేశాలు రద్దు చేసినట్లు గుర్తు చేశారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

జనగామ, జూన్ 29:: దళితుల కోసం దళిత సాధికారత పథకం ప్రకటిచినందుకు గాను సీఎం కేసీఆర్ చిత్ర పటానికి జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి పాలాభిషేకం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి అధ్యక్షతన సీఎం కేసీఆర్ దళితుల కోసం దళిత సాధికారత పథకం ప్రకటించినందుకు పాలాభిషేకం చేసినట్లు సంపత్‌రెడ్డి తెలిపారు. టీఆర్ఎస్‌తోనే దళితుల అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. దళితుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని ఆయన తెలిపారు.

మోడెర్నా వ్యాక్సిన్‌కు అత్యవసర అనుమతి మంజూరు చేసిన భారత్

న్యూఢిల్లీ, జూన్ 29:భారత్‌లో మరో కరోనా వైరస్ వ్యాక్సిన్ వస్తోంది. అమెరికా కంపెనీ మోడెర్నా తయారు చేసిన వ్యాక్సిన్ దిగుమతి, అత్యవసర వినియోగానికి మంగళవారం డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముంబైలోని ఫార్మాసూటికల్ కంపెనీ సిప్లా ఈ వ్యాక్సిన్‌ను ఇండియాకు దిగుమతి చేసుకోనుంది. సోమవారమే ఈ సంస్థ దీనికోసం డీసీజీఐ అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకుంది. మోడెర్నా అనేది మెసెంజర్ ఆర్ఎన్ఏ (ఎంఆర్ఎన్ఏ) వ్యాక్సిన్. ఇది కరోనాపై 90 శాతం సమర్థంగా పని చేస్తున్నట్లు తేలింది. ఇండియాలో కరోనా వైరస్ కోసం అత్యవసర అనుమతి పొందిన నాలుగో వ్యాక్సిన్ మోడెర్నా. ఇప్పటికే కొవిషీల్డ్, కొవాగ్జిన్, స్పుత్నిక్ వీలకు డీసీజీఐ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే.

ప్రజారోగ్యానికి 10 వేల కోట్లు -హోంమంత్రి మహమూద్‌అలీ

హైదరాబాద్ , జూన్ 29:రాష్ట్రంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం కేసీఆర్ రూ.10 వేల కోట్లు కేటాయించారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. దవాఖానలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్, హెటిరో సంస్థ సహకారంతో స్కిన్ బ్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ, ఉస్మానియా దవాఖానకు దేశంలోనే ఉస్మానియాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ దవాఖానకు మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ నుంచి రోగులు వచ్చి చికిత్స చేయించుకుంటారన్నారు. ఇంతటి గొప్ప ఉస్మానియా దవాఖానలో స్కిన్‌బ్యాంక్ ప్రారంభించడం సంతోషకరమని ఇది రెండు తెలుగు రాష్ట్రాలలోనే తొలిసారి అన్నారు.

స్కిన్‌బ్యాంక్ వల్ల తీవ్రం గా కాలిన గాయాలకు గురైన రోగుల ప్రాణాలు కాపాడవచ్చన్నారు. స్కిన్‌బ్యాంక్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడంతో పాటు దాని నిర్వహణ కోసం రూ.75 లక్షలు ప్రకటించిన హెటిరో డ్రగ్స్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ పార్థసారథిని మంత్రి అభినందించారు. ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పలుకూరి లక్ష్మి, డాక్టర్ నాగప్రసాద్, హెటిరో చైర్మన్ డాక్టర్ పార్థసారథి, రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమంత్‌రెడ్డి, డాక్టర్ పాండు నాయక్ పాల్గొన్నారు.

మహిళలను కాపాడే అస్త్రం దిశ యాప్

అమరావతి, జూన్ 29:ఆపదలో ఉన్న మహిళలు, యువతులను కాపాడే అస్త్రం 'దిశ యాప్' అని సీఎం వైఎస్ జగన్ అన్నారు.

దిశ యాప్‌కు మహిళా పోలీసులు, వాలంటీర్లే అంబాసిడర్లు తెలిపారు. మంగళవారం దిశ మొబైల్ యాప్ అవగాహన సదస్సులో భాగంగా విజయవాడలోని గొల్లపూడిలో నిర్వహించిన దిశ యాప్ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. మహిళా భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన దిశ మొబైల్ యాప్‌ను విద్యార్థినులు, యువతులు, మహిళలకు వివరించారు.

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి 'దిశ యాప్'పై అవగాహన కల్పించాలన్నారు. మహిళలందరితోనూ యాప్ ను డౌన్ లోడ్ చేయించాలని వారికి సూచించారు. ప్రకాశం బ్యారేజీ ఘటన కలచి వేసిందని, యువతులు, మహిళల భద్రతకోసమే ఈ దిశ యాప్ ను రూపొందించామని ఆయన చెప్పారు. స్మార్ట్ ఫోన్ ఉండే ప్రతి మహిళా ఈయాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే 17 లక్షల మందికిపైగా ఈ యాప్ ను డౌన్ లోడ్ చేసుకున్నారని, యాప్ కు నాలుగు అవార్డులు కూడా వచ్చాయని ఆయన వివరించారు. పోలీసులు మంచి చేసే ఆప్తులన్నారు. మహిళల భద్రత, రక్షణపై వెనకడుగు వేయబోమని ఆయన చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో 18 దిశ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. దిశ చట్టాన్నీ తెచ్చామని, త్వరలోనే ప్రత్యేక కోర్టులనూ ఏర్పాటు చేస్తామని సీఎం జగన్ చెప్పారు.

ఇంటర్ పాసైన విద్యార్థులకు.. డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్!

హైదరాబాద్ , జూన్ 29:తెలంగాణలో జులై 1 నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అడ్మిషన్స్ మొదలైయ్యాయి. సోమవారం ఇంటర్ సెకండియర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ పాసైన విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరనున్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్) నోటిఫికేషన్ విడుదలైంది.

జులై ఒకటి నుండి డిగ్రీ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్స్, రిజిస్ట్రేషన్స్ ప్రారంభం కానుండగా? సెప్టెంబర్ ఒకటి నుండి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. అర్హత కలిగిన విద్యార్థులు జులై 1 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు జులై 3 నుంచి 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చు. జులై 22న సీట్ల కేటాయింపు ఉంటుంది. సీటు వచ్చిన విద్యార్థులు 23వ తేదీ నుంచి జులై 27వ తేదీ వరకు ఆన్ లైన్ లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.

బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం వొకేషనల్, బీకాం హానర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీబీఎం, బీసీఏతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది.

రెండో విడత రిజిస్ట్రేషన్స్ 400 రూపాయల ఫీజుతో జులై 23 నుండి 27 వరకు.. అలాగే జులై 24 నుండి 28 వరకు రెండో విడత వెబ్ ఆప్షన్స్ ఉండనున్నాయి. ఆగస్ట్ 4 న సీట్ల కేటాయింపు జరుగనుంది. ఆగస్ట్ 5 నుండి 10 వరకు ఆన్లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా? మూడో విడత ఆగస్ట్ 5 నుండి 10 వరకు రిజిస్ట్రేషన్స్ ప్రారంభం కానున్నాయి. ఆగస్ట్ 18 న సీట్ల కేటాయింపు జరుగనుంది. ఆగస్ట్ 18 నుండి 21 వరకు అన్ని విడతల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. సెప్టెంబర్ ఒకటి నుండి తరగతులు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ప్టబీబీజూబ://టనీబబి.ఇణణ.ణనీల.తిని/ లో రిజిస్ట్రేషన్ చేయొచ్చు. లేదా దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్, మీసేవ సెంటర్, ంజూజూ ఈనీశ్రీతినీ ఓనీఎతిశ్రీవ ంజూజూ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

సిర్ మౌర్ లో జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం వాటిల్లడం పట్ల సంతాపం తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 29:హిమాచల్ ప్రదేశ్ లోని సిర్ మౌర్ లో జరిగిన ఒక ప్రమాదం కారణం గా ప్రాణనష్టం సంభవించడం పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు.మృతుల దగ్గరి సంబంధికుల కు పిఎమ్ఎన్ఆర్ఎఫ్ నుంచి రెండేసి లక్షల రూపాయల చొప్పున, గాయపడిన వారికి 50,000 రూపాయల వంతున పరిహారాన్ని అందించడం జరుగుతుందని పిఎమ్ఒ తరఫున చేసిన ఒక ట్వీట్ లో ప్రధాన మంత్రి తెలియజేశారు. "హిమాచల్ ప్రదేశ్ లోని సిర్ మౌర్ లో జరిగిన ఒక ప్రమాదం లో ప్రాణనష్టం సంభవించడం నన్ను వేదన కు గురి చేసింది. ఆప్తుల ను కోల్పోయిన కుటుంబాల కు ఇదే నా సంతాపం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి అంటూ ఆ ఈశ్వరుడి ని ప్రార్థిస్తున్నాను. మృతుల దగ్గరి సంబంధికుల కు పిఎమ్ఎన్ఆర్ఎఫ్ నుంచి 2 లక్షల రూపాయల చొప్పున పరిహారాన్ని అందించడం జరుగుతుంది. గాయపడ్డ వ్యక్తుల కు 50,000 రూపాయల వంతుల ఇవ్వడం జరుగుతుంది: ప్రధాన మంత్రి మోదీ."

మంత్రి కొడాలి నానికి శ్రీనివాస్‌గౌడ్ కౌంటర్

హైదరాబాద్ , జూన్ 29:ఏపీ, తెలంగాణ మంత్రుల మధ్య మాటల యుద్ధం ముదిరింది. తాజాగా మంత్రి కొడాలి నానిపై మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏపీ మంత్రి కొడాలి నానికి హైదరాబాద్‌లో రెండు ఇళ్లు ఉన్నాయని, ఆయన ఇక్కడ వ్యాపారం చేస్తున్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. అందుకైనా కనీసం ఆలోచించి మాట్లాడాలి కదా అని ప్రశ్నించారు. సి.రామచంద్రయ్య కూడా వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడొద్దని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఇక్కడ తింటూ అక్కడి మాట మాట్లాడితే ఇక్కడి ప్రజలు మీ గురించి ఆలోచన చేస్తే పరిస్థితి ఏంటి? అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. తమ పదవులు పోయినా, ప్రాణాలు పోయినా ఏపీ అక్రమంగా కడుతున్న ప్రాజెక్టును అడ్డుకుంటామని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

ఇప్పుడిప్పుడే పాలమూరు పచ్చబడుతుందని, పాలమూరు ప్రాజెక్టు పూర్తయితే బతుకులు బాగుపడతాయని ప్రజలు ఆశతో ఉన్నారని మంత్రి శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. ఆ ఆశలకు పక్క రాష్ట్రం గండికొడుతోందన్నారు. పాలమూరు ప్రాజెక్టు పూర్తికావాలని ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారని.. జగన్ ప్రభుత్వం వరద జలాల పేరుతో నికర జలాలను తరలిస్తోందన్నారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును అక్రమంగా నిర్మిస్తున్నారని చెప్పారు. కృష్ణా రివర్ బోర్డ్ రాయలసీమ ప్రాజెక్టును ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. హైడల్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి ఆపాలని మాకు ఎలా ఆదేశాలు ఇస్తారని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు.

తెలంగాణ నరరూప రాక్షసుడు వైఎస్ఆర్ అని, తెలంగాణ ఉద్యమంలో ఉన్నవారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత ఆయనది అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అనడంతో వైసీపీ నేతలు మంత్రులు విరుచుకుపడుతున్నారు. దానికి సంబంధించి మంత్రుల మధ్య కౌంటర్ అటాక్ కంటిన్యూ అవుతుంది. వైఎస్ఆర్ బతికి ఉంటే రాష్ట్రం ఇలా ఉండేదికాదని మంత్రి కొడాలి నాని అన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు కాకుండా కాపాడినవారు వైఎస్ఆర్ అని వ్యాఖ్యానించారు. ఏ రాష్ట్ర ప్రయోజనాలు ఆ రాష్ట్రానికి ఉంటాయని కొడాలి నాని తెలిపారు. ఆ రాష్ట్ర ప్రయోజనాలు వారు చూసుకోవాలని హితవు పలికారు.

ఈ ఘనత మనదే : మంత్రి నిరంజన్‌రెడ్డి

కరీంనగర్, జూన్ 29:భారీ ప్రాజెక్టు కాళేశ్వరాన్ని మూడేళ్లలో పూర్తి చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంక మండలం కోర్కల్ రైతువేదికను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయరంగం గొప్ప ఉపాధి ఇస్తోందన్నారు. రైతుబంధు అద్భుతమైన కార్యక్రమం అన్నారు. 2018లో ఎన్నికల కోసమే రైతుబంధు అని విమర్శించారు. కరోనా కష్ట కలాంలోనూ రైతుబంధు కొనసాగించినట్లు తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా రైతుబంధు లేదన్నారు. డిమాండ్ అనుసరించి పంటలు సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు. జీఎస్టీ పేరిట కేంద్రానికి ట్యాక్స్ వెళ్లడమే తప్ప మనకు వచ్చేది ఏమీ లేదని మంత్రి పేర్కొన్నారు.

మేము గెలిస్తే.. 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్!

న్యూఢిల్లీ, జూన్ 29:పంజాబ్ ఎన్నికల్లో గెలిస్తే రాష్ట్రంలోని అన్ని ఇళ్లకు 300 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించారు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్. దీంతోపాటు తాము అధికారంలోకి వస్తే కరెంటుకు సంబంధించి మరో రెండు పనులు కూడా చేస్తామని ఆయన చెప్పారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అన్ని కరెంటు బిల్లులు మాఫీ చేస్తామని, 24 గంటల కరెంటు ఇస్తామని కేజ్రీవాల్ ప్రకటించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

తాము ఢిల్లీలో తొలిసారి 2013లో పోటీ చేసిన సమయంలోనూ అప్పటి ప్రభుత్వాల హయాంలో భారీగా కరెంటు బిల్లులు వచ్చేవని కేజ్రీవాల్ చెప్పారు. కరెంటు కంపెనీలతో ప్రభుత్వాలు కుమ్మక్కవడంలో ఈ పరిస్థితి ఉండేదని, పంజాబ్‌లోనూ ఇదే జరుగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం ఢిల్లీలో 24 గంటల కరెంటు.. అతి తక్కువ ధరకే ఇస్తున్నట్లు చెప్పారు. పంజాబ్‌లోనూ అధికారంలోకి వస్తే అదే చేస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కోకు సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

హైదరాబాద్ , జూన్ 29:విద్యుత్ ఉద్యోగుల విభజనకు సంబంధించి తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ జెన్ కో, ట్రాన్స్ కోలకు సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులను జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం తమను విధుల్లోకి తీసుకోవట్లేదంటూ 84 మంది విద్యుత్ ఉద్యోగులు వేసిన వ్యాజ్యాన్ని మంగళవారం సుప్రీంకోర్టు విచారించింది.

ధర్మాధికారి కమిటీ నివేదిక ప్రకారం మొత్తం 1,150 మంది విద్యుత్ ఉద్యోగులను రెండు రాష్ట్రాలకు సమానంగా కేటాయించారు. అందులో ఇప్పటికే ఏపీ ప్రభుత్వం 655 మందిని విధుల్లోకి తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం.. 84 మందిని మినహాయించి మిగిలిన వారిని విధుల్లోకి తీసుకుంది. దీంతో ఆ ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు.. జెన్ కో, ట్రాన్స్ కో సీఎండీ ప్రభాకర్ రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, కార్పొరేట్ ఆఫీస్ అధికారి గోపాలరావులకు నోటీసులను ఇచ్చింది. విచారణను జులై 16కి వాయిదా వేసింది.

పల్లె ప్రగతి నిరంతరం కొనసాగాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, జూన్ 29: గ్రామాల్లో, పట్టణాల్లో పల్లె,పట్టణ ప్రగతి నిరంతరం కొనసాగాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రతి గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్‌లో మహబూబ్ నగర్, నారాయణ పేట జిల్లాల్లో పట్టణ, పల్లె ప్రగతిపై సన్నాహక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధ్భంగా మంత్రి మాట్లాడుతూ..హరితహారంలో నాటిన మొక్కలతో రోడ్లకు ఇరువైలా చెట్లు స్వాగతం పలుకుతున్నట్లు ఉండాలన్నారు.

విద్యుత్ లైన్ లు, పోల్ షిఫ్టింగ్ వంటి పెండింగ్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి చెందిన పూర్తి సమాచారం, చేసిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన నిధులు గ్రామ పంచాయతీ దగ్గర బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేసే పనులకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలన్నారు.

గ్రామాల్లో పల్లె ప్రగతిలో భాగంగా వందశాతం పనులు పూర్తి చేసిన గ్రామానికి అవార్డ్ అందిస్తామని పేర్కొన్నారు.

ప్రతి నెల గ్రామానికి, మున్సిపాలిటీ కి నిధులు అందిస్తున్నాం. సమస్యలకు పరిష్కారం వెంటనే చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మా రెడ్డి, చిట్టెం రాం మోహన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ లు స్వర్ణ, వనజ, కలెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాక్షి
సాహిత్య మాస పత్రిక
శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి
స్మారక కథల పోటీ



విశాలాక్షి సాహిత్యమాస పత్రిక సంక్రాంతి కథల పోటీ నిర్వహించిన విజయానందంలో ఇప్పుడు శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డి స్మారక కథల పోటీతో మరోసారి కథా రచయిత (త్రు)లకు చేరువవుతుంది. సంక్రాంతి కథల ప్రత్యేక సంపుటి లానే మరో కథల సంపుటిని ప్రత్యేకంగా తీసుకు వచ్చే ప్రయత్నంలో ఉన్నాము. మీరంతా బహుమతులతో, మంచి తెలుగు కథలతో ప్రత్యేక సంపుటిని తెలుగు కథా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిపేలా భాగస్వాములయ్యేందుకు కొత్త కలంతో, సిరా బలంతో ముందుకు రావాలని మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాము.

బహుమతుల వివరాలు

వేసవి కథల సంపుటి కోసం	15 కథలు
15 కథలు ఎంపిక జరుగుతుంది.	ఒక్కో కథకు రూ. 3000/-
ఒక్కో కథకు రూ. 3000/-	సమాన బహుమతి
సమాన బహుమతి ఉంటుంది.	మొత్తం రూ. 45,000/-

ఎంపికైన మరికొన్ని కథలు - విశాలాక్షి మాసపత్రికలో సాధారణ ప్రచురణ జరుగుతుంది

- స్వచ్ఛమైన తెలుగు కథ. కొత్త కథ అయి ఉండాలి
- తిరిగొచ్చిన కథలు, జెరాక్స్ ప్రతులు వద్దు
- ఏదైనా సామాజిక అంశం.
- A4లో 5 పేజీలు మించకుండా యూనికోడ్‌లో మెయిల్‌కు పంపాలి.
- కథ మీద రచయిత పేరు లేకుండా ప్రత్యేకంగా హామీ పత్రంలో రాయాలి.
- ఎంపిక కాని కథలు తిరిగి పంపరనే విషయాలు ప్రత్యేకంగా చెప్పటం లేదు.

కథలు పంపవలసిన మెయిల్ :
e-mail : visalakshi.poteelu@gmail.com

Address :
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785

గడువు : 15-7-2021

వాహన పరీక్షల కోసం ఆసియాలోనే పొడవైన, ప్రపంచంలో ఐదవ పొడవైన హై స్పీడ్ ట్రాక్‌ను ప్రారంభించిన భారత్

న్యూఢిల్లీ, జూన్ 29:కేంద్ర భారీ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థల శాఖ మంత్రి శ్రీ ప్రకాష్ జావడేకర్, 'నాట్రాక్స్- ది హై స్పీడ్ ట్రాక్' (హెచ్ఎస్‌టీ)ను ఇండోర్‌లో ప్రారంభించారు. ఇది ఆసియాలోనే అతి పొడవైన ట్రాక్. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో దీనిని అభివృద్ధి చేశారు. ద్విచక్ర వాహనాల నుంచి భారీ ట్రక్కుల వరకు, అన్ని రకాల వాహనాలకు అన్ని రకాల గరిష్ట వేగ పరీక్షలను ఒకేచోట చేసే కేంద్రమిది.

ప్రపంచ స్థాయిలో నిర్మించిన 11.3 కిలోమీటర్ల హై స్పీడ్ ట్రాక్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి; వాహనాలు, తయారీ, విడిభాగాల రంగంలో ప్రపంచ కేంద్రంగా అవతరించడమే భారత్ లక్ష్యంగా వివరించారు. "ఆత్మనిర్భర్ భారత్ వైపు మనం వేగంగా అడుగులేస్తున్నాం. ఆ దిశగా అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన దేశం వాహన తయారీ కేంద్రంగా మారాలన్న ప్రధాని కలను నెరవేర్చడానికి మా మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. వాహన, ఉత్పాదక పరిశ్రమల అభివృద్ధి ఉద్యోగ కల్పనలో సాయం చేస్తుంది" అని చెప్పారు.

రైల్వేలు, ప్రధాన రహదారులు, జలమార్గాల్లో ఏళ్ల తరబడి నానుతున్న ప్రాజెక్టులు, తమ ప్రభుత్వ బలమైన రాజకీయ సంకల్పం వల్ల ఇప్పుడు పూర్తవుతున్నాయని మంత్రి జావడేకర్ చెప్పారు.

భారీ పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థల శాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్‌వాల్ కూడా ఈ సందర్భంగా మాట్లాడారు. దేశ భారీ సాధికారతకు తయారీ, వాహన రంగ పరిశ్రమలు సాయం చేస్తాయి కాబట్టి, ఆ రంగాలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు.

నాట్రాక్స్ కేంద్రంలో వాహనల గరిష్ట వేగం, ఆక్సిలరేషన్, స్థిరమైన వేగ ఇంధన వినియోగం, రియల్ రోడ్ డ్రైవింగ్ సిమ్యులేషన్ ద్వారా ఉద్గార పరీక్షలు, గరిష్ట వేగ నిర్వహణ, లేన్ మార్పు, అధిక వేగ మన్నిక వంటి పరీక్షల సమయంలో అధిక వేగ నిర్వహణ, స్థిరత్వ మూల్యాంకనం వంటి పరీక్షలను నిర్వహిస్తారు. 'వెహికల్ డైనమిక్స్'కు ఇది ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్'.

బీఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెజ్, ఆడి, ఫెరారీ, లాంబోర్ఘిని, టెస్లా వంటి ఖరీదైన కార్ల గరిష్ట వేగ సామర్థ్యాన్ని గణించడానికి హెచ్ఎస్‌టీని ఉపయోగిస్తారు. భారత్‌లోని మరే ట్రాక్‌లోను వీటి వేగ సామర్థ్యాన్ని కొలవలేం. మధ్యప్రదేశ్ మధ్యలో ఇది ఉన్నందున, ఎక్కువ 'ప్రధాన ఓఈఎంల'కు అందుబాటులో ఉంటుంది. భారదేశ పరిస్థితులకు అనుగుణంగా ప్రోటోటైప్ కార్ల అభివృద్ధి కోసం విదేశీ ఓఈఎంలు ఇప్పుడు నాట్రాక్స్ హెచ్ఎస్‌టీపై దృష్టి పెడతాయి. ప్రస్తుతం, వాహన గరిష్ట వేగ పరీక్షల కోసం విదేశాల్లో ఉన్న తమ హై స్పీడ్ ట్రాక్‌లకు విదేశీ ఓఈఎంలు వెళుతున్నాయి.

అన్ని రకాల వాహనాల గరిష్ట వేగ సామర్థ్య పరీక్షలకు ఏక కేంద్ర పరిష్కారం ఈ ట్రాక్. ప్రపంచ పొడవైన ట్రాకుల్లో ఒకటి. ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాల వరకు విస్తృత శ్రేణి వాహనాల అవసరాలను ఇది తీర్చగలదు. స్టీరింగ్ నియంత్రణతో, వంపుల వద్ద కూడా గరిష్టంగా 375 కిలోమీటర్ల వేగాన్ని ఈ ట్రాక్‌పై సాధించవచ్చు. ఇది ప్రపంచ స్థాయి సురక్షితమైన పరీక్ష ట్రాక్‌లలో ఒకటి.

లాభాపేక్షలేని ఆసుపత్రుల నమూనాపై నీతీ ఆయోగ్ నివేదిక విడుదల

న్యూఢిల్లీ, జూన్ 29:దేశంలో లాభాపేక్షలేని ఆసుపత్రి ఎలా ఉండాలో సూచించే నమూనాపై ఒక సమగ్రమైన అధ్యయన నివేదికను నీతీ ఆయోగ్ ఈ రోజు విడుదల చేసింది. దీనితో,.. లాభాపేక్షలేని ఆసుపత్రి నమూనాపై పటిష్టమైన విధాన రూపకల్పనలో సమాచారపరంగా ఏర్పడే అంతరాన్ని పూడ్చే దిశగా ముందడుగు పడినట్టు భావించవచ్చు.

నివేదిక విడుదల సందర్భంగా నీతీ ఆయోగ్ ఆరోగ్య వ్యవహారాల సభ్యుడు డాక్టర్ వి.కె. పాల్ మాట్లాడుతూ, "దేశంలో ప్రైవేటు రంగంలో ఆరోగ్య సదుపాయాల విస్తరణకు సంబంధించి పెట్టుబడులు తక్కువ స్థాయిలోనే ఉంటున్నాయి. అయితే, ఇందుకు సంబంధించి పరిస్థితిని చక్కదిద్దేందుకు నిన్న ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీ అవకాశం కల్పిస్తుంది. లాభాపేక్షలేని ఆసుపత్రి నమూనా రూపకల్పన కూడా ఆ దిశగా ఒక చిన్న ముందడుగు అవుతుంది." అన్నారు.

అధ్యయన నివేదికను విడుదల చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నీతీ ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సి.ఇ.ఒ.) అమితాబ్ కాంత్. అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేశ్ సర్వాల్, అధ్యయనంలో పాల్గొన్న వివిధ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

లాభాపేక్షలేని ఆసుపత్రుల నిర్వహణకు సంబంధించి కూలంకషమైన సూచనలు అందించేందుకు ఈ అధ్యయన నివేదిక దోహదపడుతుంది. అలాంటి ఆసుపత్రులకు సంబంధించి పరిశోధన ఆధారంగా కనుగొన్న అంశాలను ఈ నివేదిక వివరిస్తుంది. యాజమాన్యం, సేవల వర్గీకరణ కిందకు వచ్చే ఈ ఆసుపత్రుల నిర్వహణ గురించి ఇది తెలియజేస్తుంది. ప్రైవేటు ఆసుపత్రులు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆరోగ్య పథకాల మధ్య పోలికలను కూడా ఈ నివేదిక వివరిస్తుంది.

దేశంలో ప్రైవేటు రంగంలోని ఆరోగ్య రక్షణ సేవలపై నీతీ ఆయోగ్ గత కొంతకాలంగా విస్తృత స్థాయిలో అధ్యయనం చేస్తూ వస్తోంది. లాభాపేక్షతో కూడిన ఆరోగ్య రక్షణ వ్యవస్థలు, సంస్థలపై తగినంత సమాచారం అందుబాటులో ఉన్నప్పటికీ, లాభాపేక్షలేని ఆరోగ్య రక్షణ వ్యవస్థలపై మాత్రం విశ్వసనీయమైన, సంస్థాగతమైన సమాచారం అందుబాటులో లేదు. ప్రతి ఒక్కరికి అందుబాటు యోగ్యంగా ఉంటూ నాణ్యమైన ఆరోగ్య రక్షణ సేవలను లాభాపేక్షలేని ఈ ఆసుపత్రులు నిర్విరామంగా అందిస్తూ వస్తున్నాయి.

లాభాపేక్షలేని ఆసుపత్రుల రంగం సృజనాత్మక రీతిలో ఆరోగ్య రక్షణ సేవలను అందించడమే కాక, ముందు జాగ్రత్త చర్యలతో కూడిన రక్షణ వ్యవస్థను కూడా అందిస్తోంది. సాంఘిక సంస్కరణలు, సమాజ సేవా కార్యకలాపాలు, విద్య వంటి అంశాలను ఆరోగ్య రక్షణ సదుపాయంతో అనుసంధానిస్తూ వస్తోంది. ప్రభుత్వ వనరులను వినియోగించుకుంటూ లాభాలను గురించి పట్టించుకోకుండా అందుబాటు ధరలో ఆరోగ్య రక్షణ సేవలను ఈ రంగం అందిస్తోంది. అయితే, చాలా ఏళ్లుగా ఈ రంగంపై ఎలాంటి అధ్యయనం జరగలేదు.

వైద్యానికి అయ్యే ఖర్చును కట్టడిచేసేందుకు లాభాపేక్షలేని ఆసుపత్రులు అమలు చేస్తూవస్తున్న వ్యూహాలపై తాజాగా నీతీ ఆయోగ్ అధ్యయనం చేసింది. ఈ తరహా సంస్థల కార్యకలాపాలకు సవాలుగా నిలుస్తూ, వాటి ప్రగతిని ఆటంకపరిచే అంశాలను అర్థం చేసుకోవడానికి నీతీ ఆయోగ్ ఈ అధ్యయనం ద్వారా ప్రయత్నించింది.

లాభాపేక్షలేని ఆసుపత్రుల రంగానికి సంబంధించి స్వల్పకాల, దీర్ఘకాల విధానాల రూపకల్పనసతో పాటుగా, ఇతర సంబంధిత అంశాలపై ఈ అధ్యయనం పలు సూచనలు చేసింది. లాభాపేక్షలేని ఆసుపత్రులను గుర్తించేందుకు తగిన పద్ధతులను సూచించడం, పనితీరు సూచికల ప్రాతిపదికగా వాటికి ర్యాంకులను నిర్ధారించడం, దాతృత్వ పద్ధతిని అనుసరించే అగ్రశ్రేణి ఆసుపత్రులను తగిన విధంగా ప్రోత్సహించడం తదితర అంశాలపై ఈ నివేదిక కొన్ని విధానాలను సూచించింది. దేశం మారుమూల ప్రాంతాల్లో సైతం పరిమిత ఆర్థిక వనరుల సహాయంతో మానవ వనరులను వినియోగించుకునేందుకు సంబంధించి ఆసుపత్రుల నైపుణ్యాలను ఉపయోగించుకునే అంశానికి కూడా నీతీ అధ్యయనం ప్రాధాన్యత ఇస్తోంది.

ఒకే దేశం ఒకే రేషన్ కార్డు.. స్కీమ్ అమలుకు సుప్రీం డెడ్‌లైన్

న్యూఢిల్లీ, జూన్ 29: : ఒకే దేశం ఒకే రేషన్ కార్డు (వన్ నేషన్ వన్ రేషన్ కార్డ్) స్కీమ్‌ను అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని ఇశాళ సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. దానికి జూలై 31వ తేదీని డెడ్‌లైన్‌గా ఫిక్స్ చేసింది. వన్ నేషన్ వన్ రేషన్ కార్డు విధానం ద్వారా.. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా రేషన్ కార్డు ఉన్న వ్యక్తి స్థానికంగా సబ్సిడీ ఆహారధాన్యాలు తీసుకునే వీలు ఉంటుంది

. జస్టిస్ అశోక్ భూషన్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి కూడా ఆదేశాలు జారీ చేసింది. వలస కూలీలు, అసంఘటిత కార్మికుల రిజిస్ట్రేషన్ కోసం ఓ జాతీయ వెబ్‌సైట్‌ను రూపొందించాలని కోరింది. జూలై 31వ తేదీ లోగా ఆ పోర్టల్ అందుబాటులోకి రావాలన్నది.

అన్ని రాష్ట్రాల వలస కార్మికులకు రేషన్ జారీ చేయాలని కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. కమ్యూనిటీ కిచెన్‌లను కూడా నిర్వహించి.. కోవిడ్ మహమ్మారి వేళ ఎవరూ ఆకలితో ఉండకూడదని కోర్టు చెప్పింది. రైట్ టు ఫుడ్ అనేది ప్రాథమిక హక్కు అని కోర్టు తన తీర్పులో గుర్తు చేసింది. ఆత్మనిర్భర్ స్కీమ్ కింద వలస కూలీలకు ఆహారాన్ని ఏర్పాటు చేయలేకపోయినట్లు ఓ పిటిషన్‌లో అడ్వకేటు ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు.

ఆహార భద్రత అనేది పోర్టబుల్‌గా మారిందని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఇవాళ కోర్టుకు వెల్లడించారు. వన్ నేషన్ వన్ రేషన్‌కార్డుతో ఇది సాధ్యమైందన్నారు. వలస కూలీల కోసం ఈ స్కీమ్‌ను విజయవంతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. దేశంలో ఉన్న అన్ని చౌకధర దుకాణాల నుంచి రేషన్ కార్డుతో.. బయోమెట్రిక్ విధానంలో రేషన్ తీసుకునే వెసలుబాటు కల్పించినట్లు కోర్టుకు కేంద్రం విన్నవించింది. 32 రాష్ట్రాలకు చెందిన నేషనల్ ఫుడ్ సెక్యూర్టీ యాక్ట్‌లోని 69 కోట్ల మంది లబ్ధిదారుల్ని వన్ నేషన్ వన్ రేషన్‌కార్డు పరిధిలోకి తెచ్చినట్లు భాటి తెలిపారు.

కొవిడ్-19 పై జరిగిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఓఎం) 29 వ సమావేశానికి డాక్టర్ హర్షవర్ధన్ అధ్యక్షత వహించారు

న్యూఢిల్లీ, జూన్ 29:కొవిడ్-19 పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఉన్నత స్థాయి మంత్రుల బృందం (జిఓఎం) 29 వ సమావేశంలో కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ పాల్గొన్నారు. ఆయనతో కలిసి పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ హర్దీప్ ఎస్. పూరి, హోంశాఖసహాయమంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్ మరియు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ అశ్విని కుమార్ చౌబే పాల్గొన్నారు.

కొవిడ్ నియంత్రణ కోసం నిర్విరామంగా పనిచేసిన వారితో పాటు దేశవ్యాప్తంగా కొవిడ్ టీకా కార్యక్రమాన్ని వేగవంతం చేసిన అధికార యంత్రాంగాన్ని మంత్రుల బృందం ప్రశంసించింది.

డాక్టర్ హర్షవర్ధన్ తవ ప్రారంభ ప్రసంగంలో కొవిడ్-19పై పోరాటంలో భారతదేశం చేసిన కృషిని వివరించారు: " గత 24 గంటల్లో 46,148 కేసులు మాత్రమే వచ్చాయి. దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 5,72,994 కు గణనీయంగా తగ్గింది. రికవరీ రేటు క్రమంగా పెరుగుతోంది. మరియు ఈ రోజు 96.80% వద్ద ఉంది. గత 24 గంటల్లో 58,578 రికవరీలు నమోదు చేయబడ్డాయి. ఈ రోజు వరుసగా 46 వ రోజు రోజువారీ రికవరీలు కొత్త కేసుల సంఖ్య కంటే అధికంగా నమోదయ్యాయి. మరణాల రేటు 1.30%, రోజువారీ పాజిటివిటీ రేటు 2.94% మరియు వారపు పాజిటివిటీ రేటు కూడా 2.94% వద్ద ఉంది. ఇది ఇప్పుడు 21 రోజులుగా 5% కంటే తక్కువగా ఉంది." అని తెలిపారు.

కొవిడ్ 19 టీకా డ్రైవ్ గురించి మాట్లాడుతూ డాక్టర్ హర్షవర్ధన్ " కొవిడ్-19 టీకాలో భారతదేశం మరో మైలురాయిని సాధించింది. ఇప్పటివరకూ అందించిన మొత్తం కోవిడ్ వ్యాక్సిన్ మోతాదులలో అమెరికాను అధిగమించింది. యూఎస్ఎ డిసెంబర్ 14, 2020 నుండి కొవిడ్‌కి వ్యాక్సిన్ వేయడం ప్రారంభించింది. భారతదేశంలో టీకా డ్రైవ్ జనవరి 16, 2021 న ప్రారంభించబడింది. కొవిడ్ టీకా కొత్త విధానం ప్రకారం దేశంలో టీకా తయారీదారులు ఉత్పత్తి చేస్తున్న 75% వ్యాక్సిన్లను కేంద్రప్రభుత్వం సేకరించి రాష్ట్రాలు మరియు యుటిలకు ఉచితంగా సరఫరా చేస్తోంది. ఈ రోజు ఉదయం (ఉదయం 8 గంటల వరకు) మన దేశస్తులకు వివిధ విభాగాలలో 32,36,63,297 వ్యాక్సిన్ డోసులను అందించాము. వీరిలో 1 వ మోతాదు తీసుకున్న 1,01,98,257 మంది హెల్త్‌కేర్ వర్కర్స్ (హెచ్‌సిడబ్ల్యు), 2 వ మోతాదు తీసుకున్న 72,07,617 హెచ్‌సిడబ్ల్యు, 1,74,42,767 ఫ్రంట్‌లైన్ వర్కర్స్ (ఎఫ్ఎల్‌డబ్ల్యు) (1 వ మోతాదు), 93,99,319 ఎఫ్ఎల్‌డబ్ల్యు (2 వ మోతాదు), మరియు 18-44 సంవత్సరాల వయస్సులో (1 వ మోతాదు) 8,46,51,696 మరియు 2 వ మోతాదు 19,01,190. ఇక 45 ఏళ్లు నుంచి 60 ఏళ్లు (1 వ మోతాదు) 8,71,11,445, 45 ఏళ్లు నుంచి 60 ఏళ్లు నిండిన వారు 1,48,12,349 (2 వ మోతాదు), 60 ఏళ్లు పైబడిన వారికి 6,75,29,713 (1 వ మోతాదు) మరియు 60 ఏళ్లు పైబడిన వారికి 2,34,08,944 (2 వ మోతాదు) అందించబడిందని వివరించారు.

ఈ కొవిడ్-19 దశలో సంభవించిన ముకోర్మైకోసిస్ ఇన్ఫెక్షన్‌పై ఆయన జిఓఎం సభ్యులకు వివరించారు: మొత్తం 40,845 కేసులు నమోదయ్యాయి. వీటిలో 31,344 కేసులు రైనోసెరెబ్రల్‌గా ఉన్నాయి. అంటువ్యాధుల నుండి మరణం 3,129 వద్ద ఉంది. మొత్తం సంఖ్యలో 34,940 మంది రోగులకు కొవిడ్ (85.5%), 26,187 (సుమారు 64.11%) మంది మధుమేహ వ్యాధిగ్రస్తులు కాగా సోకిన వారిలో 21,523 (52.69%) మంది స్టెరాయిడ్స్‌పై ఉన్నారు. 13,083 మంది రోగులు 18-45 (32%), 17,464 మంది 45-60 (42%) మధ్య ఉండగా, 10,082 (24%) రోగులు 60+ సంవత్సరాల వయస్సులో ఉన్నారు.కొవిడ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల ప్రాముఖ్యతను జిఓఎం గట్టిగా పునరుద్ఘాటించింది. ఐఇసి ప్రచారాల ద్వారా చేపట్టిన నిరంతర అవగాహన కార్యక్రమం హైలైట్ చేయబడింది. మాస్క్ ధరించడం మరియు చేతులను శుభ్రపరుచుకోవడం వంటి కార్యక్రమాల వల్ల కలిగే ప్రయోజనాలను డాక్టర్ వి.కె. పాల్ వివరించారు.

దేశంలోని 80 జిల్లాల్లో ఇప్పటికీ అధిక పాజిటివిటీ రేటు ఉన్నందున కొవిడ్-19 యొక్క రెండో వేవ్ ఇంకా తగ్గలేదని కార్యదర్శి (ఆరోగ్య పరిశోధన) ఉ డిజి (ఐసిఎంఆర్) డాక్టర్ బలరామ్ భార్గవ హెచ్చరించారు. కొవిడ్-19 యొక్క ఆల్ఫా, బీటా, గామా మరియు డెల్టా వేరియంట్‌లకు వ్యతిరేకంగా వ్యాక్సిన్లు ప్రభావవంతంగా ఉన్నాయని ఆయన వివరించారు.

డైరెక్టర్లు (ఎన్‌సిడిసి) డాక్టర్ సుజీత్ కె సింగ్, రాష్ట్రాలు మరియు యుటిలలో కొవిడ్ పరిస్థితిపై వివరణాత్మక నివేదికను సమర్పించారు. ప్రతి రాష్ట్రంలో మహమ్మారి యొక్క పథం యొక్క ఎపిడెమియోలాజికల్ ఫలితాల ఆధారంగా ఒక కణిక విశ్లేషణను ఆయన సమర్పించారు. కేసుల పెరుగుదల, ప్రత్యేక జిల్లాల్లో కేసుల తీవ్రత మరియు ప్రాణాంతకత వంటి ఇతర పోకడలు మరియు కొవిడ్-19 యొక్క వైవిధ్యాలు సంక్రమణకు కారణమవుతాయి.

ప్రధానంగా మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ మరియు ఒడిశాలో యాక్టివ్ కేసులు అధికంగా ఉన్నాయి. ఇవి జాతీయ కొవిడ్ వృద్ధి రేటు కంటే వృద్ధి రేటును ఎక్కువగా నివేదిస్తున్నాయి. 19 రాష్ట్రాలు మరణాల గణాంకాలు సింగిల్ డిజిట్‌లోనే (10 కన్నా తక్కువ) నివేదిస్తుండగా, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నాలుగు రాష్ట్రాలు రోజూ వందకు పైగా మరణాలను నివేదిస్తున్నాయి.

శ్రీమతి నీర్జా శేఖర్, సమాచార, ప్రసార అదనపు కార్యదర్శి టీకా సంకోచం వంటి సమస్యలను వివిధ మాధ్యమాల ద్వారా ఎలా పరిష్కరిస్తున్నారనే దానిపై జిఓఐకు వివరించారు.శ్రీ రాజేష్ భూషణ్, కార్యదర్శి (ఆరోగ్య), శ్రీ హర్ష్ వర్ధన్ శ్రింగ్లా, విదేశాంగ కార్యదర్శి, శ్రీమతి ఎస్. అపర్ణ, కార్యదర్శి (ఫార్మా), డాక్టర్ బలరామ్ భార్గవ, కార్యదర్శి (ఆరోగ్య పరిశోధన) ఉ డిజి (ఐసిఎంఆర్), కార్యదర్శి శ్రీ అజయ్ సేథ్ ఆర్థిక వ్యవహారాల విభాగం, శ్రీ అపూర్వ చంద్ర, కార్యదర్శి (కార్మిక), శ్రీ వికాష్ షీల్, అదనపు కార్యదర్శి (ఆరోగ్య), శ్రీ రాకేశ్ సన్వాల్, అదనపు కార్యదర్శి, నీతి ఆయోగ్, శ్రీమతి నీర్జా శేఖర్, అదనపు కార్యదర్శి సమాచార, ప్రసార కార్యదర్శి, డాక్టర్ సునీల్ కుమార్, డిజిహెచ్ఎస్ (ఎంఓహెచ్ఎఫ్‌డబ్ల్యు), ఎన్సిడిసి డైరెక్టర్ డాక్టర్ సుజీత్ కె. సింగ్, సాయుధ దళాల ప్రతినిధులు (సాయుధ దళాల వైద్య సేవ), ఐటిబిపి మరియు ఇతర సీనియర్ ప్రభుత్వ అధికారులు కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఈ చర్యలతో సంస్కరణలను కొనసాగించాలన్న మా ప్రభుత్వం వచనబద్ధత వెల్లడి అవుతోంది: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జూన్ 29:ఆర్థిక మంత్రి ఈ రోజు న ప్రకటించిన చర్యలు ఆర్థిక కార్యకలాపాల ను ఉత్తేజ పరచడం కోసం, ఉత్పత్తి ని, ఎగుమతుల ను పెంచడం కోసం, ఉపాధి ని కల్పించడం కోసం సాయపడుతాయి అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం, బాలల కు ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల కల్పన కోసం, రైతుల కోసం, చిన్న నవ పారిశ్రామికవేత్త ల కోసం, స్వతంత్రోపాధి కలిగిన వ్యక్తుల కోసం చర్యల ను తీసుకోవడమైంది అని ఆయన నొక్కి చెప్పారు.

ప్రధాన మంత్రి అనేక ట్వీట్ లలో ఈ కింది విధం గా పేర్కొన్నారు..

''ఆర్థిక మంత్రి ఏనిబతిబిష్టజీతీజీఎజీని ఈ రోజు న ప్రకటించిన చర్య లు ప్రజారోగ్య సౌకర్యాల ను, ప్రత్యేకించి ఆ సౌకర్యాల కు అంతగా నోచుకోని ప్రాంతాల లో, ఇనుమడింప జేయనున్నాయి.

అవి వైద్య రంగ మౌలిక సదుపాయాల కల్పన లో ప్రైవేటు పెట్టుబడి కి ప్రోత్సాహాన్ని ఇస్తాయి. అంతేకాదు, కీలకమైన మానవ వనరుల ను పెంచుతాయి కూడాను. మన బాలల ఆరోగ్య సంరక్షణ సదుపాయాల ను పటిష్ట పరచడం అనే అంశం పైన ప్రత్యేక శ్రద్ధ ను తీసుకోవడం జరిగింది.

మన రైతుల కు సాయపడటానికి ప్రాముఖ్యాన్ని ఇవ్వడమైంది. వారి కి ఖర్చుల ను తగ్గించడానికి, వారి ఆదాయాల ను పెంచడానికి, వ్యవసాయ సంబంధిత కార్యకలాపాల లో దీర్ఘకాలికత్వాన్ని సమర్థించడానికి అనేక కార్యక్రమాల ను ప్రకటించడమైంది.

మన చిన్న నవ పారిశ్రామికవేత్త లు, స్వతంత్రోపాధి కలిగిన వ్యక్తులు వారి వ్యాపార కార్యకలాపాల లో నిలదొక్కుకొనేందుకు వీలుగా, వాటి ని వారు మరింత విస్తరించుకొనేందుకు అదనపు మద్దతు ను ప్రకటించడమైంది. పర్యటన రంగం తో ముడిపడి ఉన్న వారికి సాయం చేయడానికి గాను ఆర్థిక సహాయం సహా అనేక కార్యక్రమాల ను తీసుకోవడం జరుగుతోంది.

ఆర్థిక కార్యకలాపాల ను ఉత్తేజ పరచడం లో, ఉత్పత్తి ని, ఎగుమతుల ను పెంచడంలో, ఉపాధి ని కల్పించడం లో ఈ చర్య లు తోడ్పడుతాయి. ఫలితాల తో ముడిపెట్టిన విద్యుత్తు పంపిణీ పథకం, పిపిపి ప్రాజెక్టుల కోసం సువ్యవస్థీకృత ప్రక్రియ లు, ఆస్తుల నగదీకరణ.. ఇవి సంస్కరణ ల పట్ల మా ప్రభుత్వం వచనబద్ధత ను కొనసాగిస్తోందనే విషయాన్ని చాటుతున్నాయి."

దళిత్ ఎంపవర్ మెంట్ పథకంతో మారనున్న జీవితాలు

వరంగల్ రూరల్, జూన్ 29: : సీఎం కేసీఆర్ దళిత్ ఎంపవర్ మెంట్ (దళిత సాధికారత పథకం) ప్రకటించడం పట్ల వర్ధనపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ దళిత ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకం దళితుల జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకొస్తుందన్నారు. టీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధిలో ముందుకెళ్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీలో కొత్తగా 3,620 కరోనా కేసులు.. 41 మరణాలు

అమరావతి, జూన్ 29: ఆంధ్ర ప్రదేశ్‌లో కరోనా ఉధృతి తగ్గుముఖం పట్టింది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొత్తగా 3,620 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 5,757 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారు. 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏపీలో మొత్తం కొవిడ్ పాజిటివ్ కేసులు 18,85,716కు పెరిగాయి. వీరిలో 18,32,971 మంది చికిత్సకు కోలుకున్నారు. ఇంకా 40,074 యాక్టివ్ కేసులు ఉన్నాయి. మొత్తం మరణాలు 12671కి చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ 91,231 శ్యాంపిళ్లను పరీక్షించినట్లు వైద్య ఆరోగ్యశాఖ తన నివేదికలో వెల్లడించింది.

సాగును పండుగ చేసిన మహనీయుడు సీఎం కేసీఆర్

-మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగాం, జూన్ 28 : రైతులకు ఎదురుపెట్టుబడి పెట్టి వ్యవసాయాన్ని పండుగ చేసిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి మండలంలోని కాపులకనపర్తి నుంచి సంగెం మండల కేంద్రం వరకు రూ.4.97కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు రకం పేరుతో శిస్తు వసూలు చేస్తే, టీఆర్ఎస్ ప్రభుత్వం శిస్తును రద్దు చేసి రైతులకు ఎదురుపెట్టుబడి ఇస్తున్నదన్నారు. కరోనా కష్టకాలంలో కూడా సంక్షేమ పథకాలను కొనసా గిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రంలోని ప్రతి చెరువునూ నింపి భూములను సస్యశ్యామలం చేసి బంగారు తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. జూలై 1 నుంచి 10వ తేదీ వర కు పల్లెప్రగతి, హరితహారం కార్యక్రమాల్లో ప్రజ లు భాగస్వాములై విజయ వంతం చేయాలని కోరారు. పల్లెప్రగతిలో భాగంగా ఉత్తమ గ్రామాలను గుర్తించి సర్పంచ్‌లు, అధికారులను సన్మానిం చనున్నట్లు తెలి పారు. అదేవిధంగా పనులు చేయని సర్పంచ్ లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సర్పంచ్‌లు అప్పుల పాలు కావొద్దనే జీపీ గ్రాంట్ నుంచి తీర్మానం చేసి రూ.50 లక్షల వరకు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. పల్లెప్రగతిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందిన పది గ్రామాలకు జీపీ భవనాలు మంజూరు చేయిస్తానన్నారు.గ్రీన్‌ఫీల్డ్ హైవేతోభూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాపులకనపర్తి ? సంగెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం వల్ల కాట్రపల్లి గ్రామంలో ఇండ్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయిస్తానన్నారు. కాట్రపల్లి గ్రామస్తులు సహక రించాలని కోరారు. మచ్చాపూర్, మొండ్రాయి మీదుగా కొత్తపెల్లి వరకు బీటీ డబుల్ రోడ్డు, సంగెంలో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి రూ.3కోట్ల మంజూరు చేయించాలని, దేవాదుల నీటి కోసం వెంకటాపురం వరకు భూ సేకరణ చేయించాలని, గ్రీన్‌ఫీల్డ్ హైవేతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇప్పించాలని మంత్రి ఎర్రబెల్లికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రూరల్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ కందకట్ల కళావతి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ నరహరి, పీఆర్ఈఈ శంకరయ్య, ఎంపీడీవో మల్లేశం, సర్పంచ్‌లు ఎర్రబెల్లి గోపాల్‌రావు, పులుగు సాగర్‌రెడ్డి, దొనికెల రమాశ్రీనివాస్, కావటి వెంకటయ్య, ఎంపీటీసీలు సుతారి బాలకృష్ణ, గాయపు ప్రచూర్భాస్కర్‌రెడ్డి, గుగులోత్ వీరమ్మగోపీసింగ్, పీఏసీఎస్ చైర్మ

లైఫ్ చేంజింగ్ జర్నీ 'ఢిల్లీ టు లండన్' బస్ ప్రయాణం?!

(అడ్వెంచర్స్ ఓవర్‌లాండ్ ప్రవేశపెట్టనున్న 'ఇండియా టు యూకె' బస్సు ప్రయాణ ఏర్పాట్ల నేపథ్యంలో)

న్యూఢిల్లీ, జూన్ 29: 'అడ్వెంచర్స్ ఓవర్‌లాండ్' కంపెనీ త్వరలో నిర్వహించనున్న 'ఢిల్లీ టు లండన్' బస్సు ప్రయాణం ఆసక్తిగల సాహసవీరులకు, పర్యాటకులకు అపూర్వ అనుభూతులను ఇవ్వనున్నది. అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక దూరం కవర్ చేయనున్న 'బస్ టు లండన్' యాత్రలో 20 మంది యాత్రికులు, 20,000 కిమీ (12,427 మైళ్లు) దూరాన్ని 70 రోజుల్లో ఖండాలు దాటుతూ, 8-టైమ్ జోన్లు తాకుతూ, 18 దేశాలను మీదుగా పరుగిడుతూ మరుపురాని గుర్తులను ప్రదానం చేయనుందనే విషయం సాహసయాత్రలను ఇష్టపడే వారికి పర్యాటక విందు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నది. 'ఢిల్లీ టు లండన్' ప్రయాణానికి దాదాపు ? 15 లక్షల ఖర్చు కాగల ప్రయాణంలో ఒక్కో భాగానికి 3.5 - 4.95 లక్షల ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రయాణాన్ని ఒకటి లేదా కొన్ని భాగాలుగా కూడా చేసుకునే వెసులుబాటు కల్పించడం విశేషం. ప్రయాణంలో భాగంగా హోటల్ రూమ్‌లు, భోజన వసతులను నిర్వహకులే కల్పించనున్నారు.

ఈ బస్సు ప్రయాణానికి ఇప్పటి వరకు 40,000 మంది ప్రయాణీకులు తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగింది. ఈ ప్రయాణంలో చూడదగిన ప్రదేశాలలో కొన్నింటికి విమాన లేదా రైలు వసతులు కూడా లేవని గమనించాలి. బస్సు యాత్రలో ప్రకృతి అందాలు, పర్యాటక సోయగాలు, మారుమూల ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదలు, వైవిధ్యభరిత సంస్కృతులు, విలక్షణ జనజాతులను చూసే భాగ్యం కూడా కలుగనుంది. 'బస్ టు లండన్' ప్రయాణం చేసే యాత్రీకులకు అపూర్వ అనుభవాలు, జీవితంలో మరిచి పోలేని జ్ఞాపకాలు, చారిత్రక ప్రయోగాలు, ఉల్లాసభరిత, స్వేచ్ఛ విహంగ రీతులు మరియు సాహసక్రియలు అనుభవంలోకి రానున్నాయని నిర్వాహకులు తెలియజేస్తున్నారు. మే 2021 తరువాత ప్రారంభం కానున్న బస్సు యాత్ర కరోనా కల్లోల నేపథ్యంలో ఏప్రిల్ 2022కి వాయిదా వేయడం జరిగిందని గమనించాలి.

24-గంటల వైఫై వసతులు కల్పించబడిన ఈ బస్సులో అత్యాధునిక వసతులు, సౌకర్యవంతమైన సీట్ అమరికలు, వినోద వనరులు, లాకర్, స్వయం పాంట్రీ, స్నాక్స్ లాంటి విలాసవంతమైన సౌకర్యాలు కల్పించబడతాని నిర్వాహకులు సంజయ్ మదన్, తుషార్ అగర్వాల్‌లు తెలిపారు. గతంలో ఇలాంటి 'రోడ్ టు లండన్' ప్రయాణాలను 2017, 2018, 2019లలో కూడా చేపట్టామని తెలిపారు. ఈ బస్ ప్రయాణీకులు 10 వీసాలు అవసరం అవుతాయని, ఆరు మాసాల ముందే ప్రణాళికలు చేపడతామని తెలిపారు. 'ఢిల్లీ టు లండన్' బస్సు ప్రయాణంలో అనేక మియన్మార్ పగోడాలు, చెంగ్డూలోని అరుదైన పాండాస్, చైనా సిల్క్ రూట్, సెంట్రల్ ఏసియా, గ్రేట్ వాల్ ఆఫ్ చైనా, యూరోపియన్ దేశాల అందాల విందులు యాత్రికులను పరమానందసాగరంలో ముంచనున్నాయి. లండన్ చేరిన తరువాత ఒక నెల విరామంతో తిరిగి 'లండన్ టు ఢిల్లీ' యాత్ర ప్రారంభం అవుతుంది. ఈ 70-రోజుల బస్ ప్రయాణాన్ని నాలుగు భాగాలుగా వర్గీకరించారు.

భాగం-1 ఇండియా, మయన్మార్, థాయ్‌లాండ్ (సౌత్ ఈస్ట్ ఏసియా - 11 రాత్రులు, 12 రోజులు):

న్యూఢిల్లీలో ప్రారంభమయ్యే అత్యంత దూరమైన బస్సు ప్రయాణంలో ఇండియా సరిహద్దులు దాటుతూ మయన్మార్‌లో అడుగు పెడుతూ అందాలను ఆరబోయనుంది. పురాతన 'బగాన్', క్రియాశీల 'యాంగాన్', 'గోల్డెన్ రాక్ పకోడ', 'మౌంట్ కైక్టో' లాంటి పర్యాటక స్థలాలను పరిచయం చేయనుంది. మయన్మార్ దాటుతూ థాయ్‌లాండ్‌లోకి అడుగు పెడుతూ బ్యాంకాక్ నగర వెలుగులను చూపుతూ 'చియాంగ్ కోణగ్', 'మెకాంగ్ నది', 'లావోస్'లను చూపుతూ చైనాలోకి ప్రవేశిస్తుంది. ఈ ప్రయాణానికి 12 రోజుల సమయం తీసుకోనుంది.

భాగం-2 చైనా (15 రాత్రులు, 16 రోజులు) :

'కుమిన్గ్- సిటీ ఆఫ్ ఎటర్నల్ స్ప్రింగ్' వద్ద చైనా భూభాగంలోకి ప్రవేశించే బస్సు 16 రోజుల పాటు చైనా దేశ అందాలను యాత్రికులకు చూపనుంది. సిల్క్ రోడ్డు దారిన ఉన్న 'గ్రేట్ వాల్ ఆఫ్ చైనా', 'మోంగో గుహల'ను చూసే భాగ్యం కలుగనుంది. 'గ్జిన్‌జియాంగ్', 'టర్పన్', 'కష్గర్', 'కాస్పియన్ సముద్రాల'ను పరిచయం చేసే ప్రయాణంలో రెండవ భాగం పూర్తి అవుతుంది.

భాగం-3 సెంట్రల్ ఏసియా (కర్గిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్, రష్యా - 21 రాత్రులు, 22 రోజులు):

చైనా భూభాగాన్ని దాటుతూ సిల్క్ రూట్‌లో కిర్గిస్థాన్‌లోని 'బిష్కెక్'లో అడుగిడుతూ 'సెంట్రల్ ఏసియాలోని 'క్రౌన్ జువెల్' దేశం ఉజ్బెకిస్థాన్ కాపిటల్ 'తాష్కంట్' చేరుతుంది. ఈ దేశంలోని 'సమర్ఖండ్', 'భుకారా', 'కివా'లను పరిచయం చేయనుంది. బస్సు ప్రయాణంలో తరువాత కజకిస్థాన్ దాటుతూ రష్యాలోకి అడుగిడుతుంది. రష్యాలోని 'అస్ట్రఖాన్', 'మాస్కో' నగరాన్ని చూసే భాగ్యం కలుగుతుంది. ఈ ప్రయాణానికి 22 రోజుల సమయం తీసుకుంటుంది.

భాగం-4 యూరప్ (లాట్వియా, లితువానియా, పోలాండ్, చెక్ రిపబ్లిక్, జర్మనీ, నెథర్లాండ్, బెల్జియమ్, ఫ్రాన్స్, యూకె - 15 రాత్రులు, 16 రోజులు):

రష్యా దాటిన బస్సు ప్రయాణం యూరోప్‌లోకి ప్రవేశించి లాట్వియా, లితువానియా దేశాల అందాలను చూపుతుంది. లితువానియాలోని యునెస్కో గుర్తింపు పొందిన 'బరోక్యూ పురాతన నగరం' చూసే అవకాశం కలుగుతుంది. యూరప్‌లోని పోలాండ్ రాజధాని 'వార్సా', చెక్ రిపబ్లిక్ రాజధాని 'ప్రాగ్', జర్మనీలోని 'ఫ్రాంక్‌ఫర్ట్'ను తాకుతూ, నెథర్లాండ్, బెల్జియమ్, ఫ్రాన్స్ గుండా గమ్యస్థానం లండన్‌కు చేరుతుంది. ఈ చివరి భాగానికి 16 రోజుల సమయం పడుతుంది.

1957లో చారిత్రక 'కోల్‌కతా టు టు లండన్' బస్సు యాత్ర:

15 ఏప్రిల్ 1957న లండన్ నుంచి ప్రారంభమైన 'ఇండియామాన్' పేరుతో జరిగిన చారిత్రక బస్సు ప్రయాణం జూన్ 05, 1957న కలకత్తా చేరడం జరిగింది. ఇదే బస్సు తిరిగి 'కలకత్తా టు లండన్' ప్రయాణం 02 ఆగష్టు 1957న ముగిసింది. నాటి ప్రయాణీకులు సింగిల్ జర్నీకి చేసిన ఖర్చు 85 పౌండ్లుగా ఉండేది. లండన్‌లో ప్రారంభమైన ఈ 'మాజిక్ బస్' ప్రయాణంలో ఫ్రాన్స్, ఇటలీ, యుగెస్లావియా, బర్గేరియా, టర్కీ, ఇరాన్, పాకిస్థాన్‌ల గుండా కలకత్తా చేరింది.

ఇలాంటి చారిత్రక అంతర్జాతీయ బస్సు ప్రయాణం యాత్రికులకు 'లైఫ్ చేంజింగ్ జర్నీ' అవుతుందనడంలో అతిశయోక్తి లేదు. ఆసక్తి, వనరులు కలిగిన దేశ పౌరులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అపూర్వ అనుభూతులను స్వంతం చేసుకోవాలని ఆశిస్తున్నాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఇంట్లో చొరబడి వృద్ధ దంపతుల దారుణహత్య..!

జైపూర్, జూన్ 29:: రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ జిల్లాలో దారుణం జరిగింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతులను గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్యచేశారు. అజ్మీర్‌లోని గౌలవుర ఏరియాలో సోమవారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గౌలపురా ఏరియాలో మదన్ సింగ్ (85), ఆయన మైనా దేవి (81) ఓ ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. వారి ఇంటికి సమీపంలోనే కుమారుడి ఇల్లు కూడా ఉన్నది.

ఈ క్రమంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మదన్ సింగ్ ఇంట్లో చొరబడ్డారు. మదన్‌సింగ్‌ను, ఆయన భార్య మైనాదేవిని గొంతుకోసి చంపేశారు. మంగళవారం ఉదయం మృతుల కుమారుడు తల్లిదండ్రులకు టీ ఇచ్చేందుకు వెళ్లగా దారుణం వెలుగుచూసింది. అతడు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వృద్ధురాలిపై ఉన్న ఆభరణాల కోసమే దుండగులు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

57 ఏండ్ల వయసులో పది పాసైన ఆశా వర్కర్

భువనేశ్వర్, జూన్ 29: : చిన్నతనంలోనే పెళ్లి.. అంతంత మాత్రం చదువు.. ఇద్దరు పిల్లలు పుట్టగానే భర్త మృతి.. స్కూల్లో వంట చేస్తూ అరకొర జీతంతో పిల్లలను పోషిస్తున్న ఓ మహిళకు ఆశా వర్కర్ ఉద్యోగం వరించింది. కానీ ఆ ఉద్యోగంలో కొనసాగాలంటే టెన్త్ కచ్చితంగా పాస్ అయి ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో సదరు మహిళ 57 ఏండ్ల వయసులో పది పాసై అందరికీ ఆదర్శంగా నిలిచింది.

ఒడిశా భద్రక్ జిల్లాలోని కాంతిగన్ గ్రామానికి చెందిన స్వర్ణలత ఏడో తరగతి వరకు మాత్రమే చదివింది. ఆమెకు అప్పుడే వివాహమైంది. దీంతో విద్యకు దూరం కావాల్సి వచ్చింది. ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత 27 ఏండ్ల వయసులో భర్తను కోల్పోయింది. జాబ్ కోసం ఏ కంపెనీ చుట్టూ తిరిగిన ఆమెకు విద్యార్హత లేకపోవడంతో ఉద్యోగం దొరకలేదు. ఈ క్రమంలో ఆమె సొంత గ్రామంలోని పాఠశాలలో వంట మనిషిగా ఉపాధి దొరికింది. నెలకు రూ. 100 జీతంగా వచ్చేది. ఆ సంపాదనతోనే కుటుంబాన్ని పోషించేది. 2005లో స్వర్ణలత ఆశా వర్కర్‌గా నియామకమైంది. ఆశా వర్కర్‌గా విధులు సమర్థవంతంగా నిర్వర్తించినందుకు జిల్లా స్థాయిలో ఆమెను ఎన్నో అవార్డులు వరించాయి. పిల్లలను పీజీ స్థాయి వరకు చదివించింది.

మళ్లీ పుస్తకాలతో కుస్తీ

ఇక 2019లో ఒడిశా ప్రభుత్వం కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఆశా వర్కర్లుగా కొనసాగాలంటే కచ్చితంగా పదో తరగతి పాస్ కావాలన్న నిబంధన విధించింది. దీంతో స్వర్ణలత మళ్లీ పుస్తకాలతో కుస్తీ పట్టాల్సి వచ్చింది. పాఠశాలలో వంట మనిషిగా, గ్రామానికి ఆశా వర్కర్‌గా కొనసాగుతూనే.. పదో తరగతి పరీక్షలకు ఆమె సిద్ధమైంది. 2019, డిసెంబర్‌లో ఓపెన్ టెన్త్ ఎగ్జామ్స్‌కు ఫీజు కట్టింది. 2020, మార్చిలో ఎగ్జామ్స్ నిర్వహించాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడ్డాయి. అదే ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన ఎగ్జామ్స్‌లో ఫెయిల్ అయ్యింది. ఇంగ్లీష్ సబ్జెక్టులో పాస్ మార్కులకు నాలుగు మార్కులు తక్కువగా రావడంతో పాస్ కాలేదు. అయితే ఈ ఏడాది కూడా కరోనా ఉధృతి కారణంగా పరీక్షలు నిర్వహించకుండా.. అందర్నీ పాస్ చేస్తున్నట్లు ఒడిశా ప్రభుత్వం ప్రకటించింది. దీంతో స్వర్ణలత పదో తరగతి పాస్ అయింది.

రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ ఇంక ఎప్పుడు చేస్తారు

వేములవాడ నియోజకవర్గలో డబుల్ బెడ్ రూంల జాడ నే లేదు - కాంగ్రెస్ టీ పీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 29(నేటినిజం ప్రతినిధి): టీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల ముందు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామన హామీ ఇప్పుడు వరకు అమలు కాలేదని కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్‌అన్నారు.మంగళవారం రోజున వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజక వర్గం లో స్థానిక శాసనసభ్యుడు లేకపోవడం వలన ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకొని పోయి ఉన్నాయి దేవాలయ అభివృద్ధికి నిధులు రాలేదు వేములవాడ లో సమస్యల పరిష్కారానికి పట్టించుకునే నాథుడే కరువు అయ్యాడు వెంటనే వర్షాకాలం ప్రారంభం అయింది పెట్టుబడులు పెట్టుకునే సమయంలో రైతుబంధు ఇచ్చి చేతులు దులుపుకోవడం సమంజసం కాదు అని అన్నారు. ఈ నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపాలని బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది అని అన్నారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సంగ స్వామి యాదవ్, బొడ్డు ప్రశాంత్ పాలకుర్తి శంకరయ్య లింగంపల్లి మనోహర్ పాలకుర్తి పర్షరాములు సుమిత్ రాకేష్ కోత్తూరు సురేష్ ప్రకాష్ జగదీష్ భరత్ తదితరులు పాల్గొన్నారు

లబ్ధిదారునికి సిఎం సహాయ నిధి చెక్కు అందజేసిన ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్

రాజన్న సిరిసిల్ల, జూన్ 29(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన బుర్ర లక్ష్మణ్ కు చికిత్స ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం సహాయ నిధి నుండి 20వేల రూపాయల చెక్కును లబ్ధిదారుల కుటుంబసభ్యులకుమంగళవారం రుద్రవరం ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్ అందజేశారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపద సమయంలో తమకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు కృషి చేసిన ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామిగౌడ్ కుకృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అతికం పావని కనకయ్య ,బీజేపీ వేములవాడ మండలం ప్రధానకార్యదర్శి కాసర్ల అరుణ్,బీజేపీ గ్రామ ప్రధాన కార్యదర్శి పార్వతి వేణుగౌడ్,బిజెపి నాయకులు గాలి పెల్లి సతీష్ పార్వతి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

వరంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ జూన్ 29:: ఆదర్శ, స్వచ్ఛ వరంగల్ నగర నిర్మాణం కోసం జులై 1 నుంచి 10 వరకు జరిగే పట్టణ ప్రగతిలో నగరంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. వరంగల్ నగర పాలక సంస్థ తొలి పాలకవర్గ సమావేశానికి హాజరై మేయర్, కార్పొరేటర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాజకీయాలకు అతీతంగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు.

నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సుముఖంగా ఉన్నారని తెలిపారు.

ప్రతి కార్పొరేటర్ తన డివిజన్ అభివృద్ధికి పోటీ పడాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నగరానికి అత్యధిక నిధులు వస్తున్నాయి. స్థానిక నాయకత్వం మరిన్ని నిధులు తీసుకొచ్చేందుకు మేం కృషి చేస్తామని హామీనిచ్చారు. మీరు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పట్టణ, పల్లెప్రగతి కార్యక్రమంతో సీజనల్ వ్యాధులు తగ్గాయని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దే డివిజన్ లకు రూ.50 లక్షల ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు.

ఓపెన్ ప్లాట్లలో చెట్లు, నీటి నిలువలు ఉంటే నోటీసులు జారీ చేయాలి. స్పందించకపోతే మున్సిపల్ కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి డివిజన్ లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీ పి.దయాకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, డా.టి.రాజయ్య, చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ తల్లికి బోనాల పండుగ -హాజరైన ప్రజాప్రతినిధులు,

రాజన్న సిరిసిల్ల, జూన్ 29(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ శివారులోని ఎల్లమ్మతల్లి అమ్మవారికి గౌడ కులస్తుల ఆరాధ్య దేవతలైన ఎల్లమ్మ అమ్మవారిబోనాల పండుగను వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంగళవారం ఎల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాల మొక్కులు చెల్లించుకుని దర్శించుకున్నారు.బోనాల పండుగ .వచ్చిన అతిథులకు సంఘం నాయకులు శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ , బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి సీనియర్ న్యాయవాది నేరెళ్ల తిరుమల తిరుమల గౌడ్ ,కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి ,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సంగ స్వామియాదవ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ , కాంగ్రెస్ నాయకులు కనికరపు రాకేశ్, వస్తా వస్తాద కృష్ణ , టిడిపి సీనియర్ నాయకులు పులి రాంబాబు గౌడ్ మంజు ఉమేందర్ గౌడ్, తో పాటు ప్రజాప్రతినిధులు,ఇతర పార్టీల వారు, పెద్ద ఎత్తున గౌడ కులస్తులు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జపాన్ కన్ స్ట్రక్షన్ అంతర్జాతీయ అవార్డు అందుకున్న తోషీబా

హైదరాబాద్, జూన్: ఉత్తరప్రదేశ్ లోని సలోరీ మురుగునీటి శుద్ధి కర్మాగారానికి జపాన్ కన్ స్ట్రక్షన్ అంతర్జాతీయ అవార్డు లభించినట్లు తోషీబా వాటర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టిడబ్ల్యుఎస్) పేర్కొంది. జపాన్ భూమి, మౌలిక సదుపాయాల కల్పన, రవాణా మరియు పర్యాటక మంత్రిత్వ శాఖ (ఎమ్ఎల్ఐటి) ఈ అవార్డును ప్రకటించినట్లు టిడబ్ల్యుఎస్ తెలిపింది. తోషీబా ఇన్ ఫ్రాస్ట్రక్చర్ సిస్టమ్స్ సొల్యూషన్స్ కార్పొరేషన్ (టిఐఎస్ఎస్) అధీనంలో, పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా టిడబ్ల్యుఎస్ పనిచేస్తోంది. సలోరీ ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణం, అమలు, నిర్వహణ మరియు ప్రాజెక్టు బదలాయింపువంటి బాధ్యతలను టిడబ్ల్యుఎస్ చేపట్టింది. ఇండియాలోని ఉత్తరప్రదేశ్ లో సలోరీ మురుగునీటి శుద్ధి కర్మాగారం రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ, అమలు, ప్రాజెక్టు బదలాయింపుతోపాటు సంబంధిత సౌకర్యాల కల్పనలో టిడబ్ల్యుఎస్ సాధించిన విజయాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఎమ్ఎల్ఐటి జపాన్ కన్ స్ట్రక్షన్ అంతర్జాతీయ అవార్డును 2017లో నెలకొల్పింది. ఈ అవార్డు ద్వారా, జపాన్ కంపెనీల పోటీతత్వంపై అంతర్జాతీయంగా అవగాహనను పెంపొందించడం, జపాన్ కంపెనీలకు మరిన్ని ప్రాజెక్టులు లభించేలా చేయడం ఎమ్ఎల్ఐటి లక్ష్యం. "నాణ్యతతో కూడిన మౌలిక సదుపాయాల కల్పన"కు జపాన్ కన్ స్ట్రక్షన్ అంతర్జాతీయ అవార్డు ఒక చిహ్నంగా మారింది. (1) విదేశాల్లో జపాన్ ఘనతను చాటి చెప్పే నిర్మాణ కంపెనీలకు మరియు (2) విదేశాల్లో చురుకుగా వ్యవహరిస్తూ, కీలక పాత్ర పోషించే చిన్న మధ్య తరహా నిర్మాణ కంపెనీలకు ఈ అవార్డు వెన్నుదన్నుగా నిలుస్తోంది. తోషిబా గ్రూపునకు ఈ అవార్డు లభించడం ఇది మొదటిసారి. గంగానదీ జలాల శుద్ధి కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు కోసం, ఉత్తరప్రదేశ్ జల్ నిగమ్ (యుపిజెఎన్)తో టిడబ్ల్యుఎస్ 2014లో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఉత్తరప్రదేశ్ లోని సలోరీలో ప్రధాన పంప్ స్టేషన్ తో సహా ఒక మురుగు నీటి శుద్ధి కర్మాగారానికి రూపకల్పన చేసి, నిర్మించి, 10 సంవత్సరాల పాటు కర్మాగారం అమలు మరియు నిర్వహణ బాధ్యతలు చేపట్టడం ఈ ప్రాజెక్టులో భాగం.మురుగు నీటి వ్యవస్థ అభివృద్ధికోసం అనేక చర్యలు చేపట్టడం ద్వారా, గంగానదీ జలాల శుద్ధితోపాటు ప్రభుత్వ ప్రాజెక్టులలో నిరంతరం పాలు పంచుకునేందుకు పునాది వేయడం ద్వారా టిడబ్ల్యుఎస్ ప్రజల మన్ననలు చూరగొంది. ఈ ప్రాజెక్టుకోసం, టిడబ్ల్యుఎస్ సీక్వెన్షియల్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్ బిఆర్) అనే క్రియాశీలకమైన మురుగు నీటి శుద్ధి ప్రక్రియ(×1)ను చేపట్టింది. ప్రాజెక్టుకు అవసరమైన భూమి, నిర్మాణ కాల వ్యవధి, నిర్వహణా ఖర్చులు తగ్గేందుకు ఈ ప్రక్రియ దోహదపడటమే కాకుండా భారత ప్రభుత్వం ఆశించిన మురుగు నీటి శుద్ధి నాణ్యతా ప్రమాణాలను అందుకునేందుకు కూడా ఈ ప్రక్రియ తోడ్పడుతుంది. ఈ కర్మాగారం రూపకల్పన మరియు నిర్మాణం కోసం, అందుబాటులో ఉండే సులభతరమైన, తేలికగా నిర్వహణ చేపట్టగలిగిన పరికరాలను వినియోగించడం ద్వారా జీవిత కాల నిర్వహణా వ్యయాన్ని తగ్గించవచ్చని టిడబ్ల్యుఎస్ స్పష్టం చేసింది.

హెల్త్‌కేర్ వర్కర్లకు క్యుమిన్ ఆహారం

హైదరాబాద్ , జూన్ 29:దక్షిణాసియాలో అతిపెద్ద ఆతిథ్య సంస్థ ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ ఐహెచ్‌సిఎల్ తమ టాటా గ్రూప్ లక్ష్యాన్ని అనుసరించి కరోనా సెకండ్ వేవ్‌పై పోరాడుతున్న హెల్త్‌కేర్ వర్కర్లకు తమ కలినరీ వేదిక క్యుమిన్ ద్వారా పదిలక్షలన ఆహార ప్యాకెట్లు పంచినట్లు తాము విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. పది రాష్ట్రాలలోని 12 నగరాలలో హెల్త్ వర్కర్లకు ఆహారం పంపిణీ చేసినట్లు సంస్థ పేర్కొంది. ఐహెచ్‌సిఎల్ మానవ వనరుల విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ ఫోకరియాల్ మాట్లాడుతూ పోరులో దేశం పట్ల సంఘీభావం ప్రకటిస్తున్నామని తెలిపారు. 10 రాష్ట్రాల్లోని 12 నగరాల్లో 38 ఆసుపత్రులకు ఈ చొరవ విస్తరించింది. ది నగరాలు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, గోవా, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ముంబై, మైసూర్, న్యూ వారణాసి మరియు విశాఖపట్నం.

"వైరస్ యొక్క రెండవ వేవ్ అన్ని ఫ్రంట్లైన్ వైద్య సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడిని కలిగించింది. పోషక మరియు ఆరోగ్యకరమైన ఖిఎతిని భోజనం మన రోగుల గురించి మన స్వంత చింతించకుండా పూర్తిగా దృష్టి పెట్టడానికి సహాయపడుతుంది. పోషణ. వైరస్తో పోరాడడంలో మాకు అండగా నిలిచిన ఐహెచ్‌సిఎల్‌కు మేము చాలా కృతజ్ఞతలు. చంద్రకాంత్ పవార్, కస్తూర్బా హాస్పిటల్. 2020 లో మొదటి తరంగంలో, 3 మిలియన్లకు పైగా భోజనం వైద్య మరియు వలస కార్మికులకు అందించబడింది దేశవ్యాప్తంగా.

ముగ్గురు ఆలయ సూపరింటెండెంట్‌లకు ఏఈఓలు గా పదోన్నతి

రాజన్న సిరిసిల్ల, జూన్ 29(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సీనియర్ సూపరింటెండెంట్లు గా విధులు నిర్వహిస్తున్న జయ కుమారి , బ్రాహ్మణగారి శ్రీనివాస్ , ప్రతాప నవీన్ లకు మంగళవారం ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ ఏ ఈ ఓ లు కల్పిస్తూ వారికి ఉత్తర్వులను అందజేశారు . దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ప్రమోషన్లు సమస్యను పరిష్కరించే ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ కు ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు . ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ ఏఈవో సంకేపల్లి హరికిషన్ , ఆలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీరాములు , పర్యవేక్షకులు గోలి శ్రీనివాస్ , నాగుల మహేష్ , అలీ శంకర్ , వరి నరసయ్య , నటరాజ్ , రామకిషన్ రావు ఉన్నారు .

ఎంపీ బండి సంజయ్ ను కలసి రాజన్న ప్రసాదం అందజేసిన అన్నారం శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 29(నేటినిజం ప్రతినిధి): వేములవాడ భారతీయ జనతా పార్టీ నాయకులు అన్నారం శ్రీనివాస్ మంగళవారం రాష్ట్ర భాజపా అధ్యక్షుడు,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ను మర్యాద పూర్వకంగా కలిసి రాజన్న ప్రసాదం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి నా వంతు కృషి చేస్తానని పట్టణంలోని 24 వ వార్డు కు ఎంపీ నిధులు కేటాయించాలని కోరారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.